తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
28-09-2026
సోమవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 230
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు
స్టాఫ్ రిపోర్టర్ల తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## యూఎల్‌సీ దరఖాస్తులకు మోక్షం



- ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణయం
- అర్హమైన భూముల క్రమబద్ధీకరణకు అధికారులకు ఆదేశాలు
- మెమో నెం.48062 జారీ చేసిన రెవెన్యూ శాఖ
- జీవో 455, 456, 747, 92 పరిధిలోని దరఖాస్తుల పరిశీలన
- 22ఏ భూ సమస్యల పరిష్కారానికీ చర్యలు

2

## 'ది ప్యారడైజ్'పై కేటీఆర్ ప్రశంసల జల్లు



- రెండు రోజుల్లోనే రూ.100 కోట్ల మార్క్ దాటిన నాని సినిమా
- సుదర్శన్ 35ఎంఎంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేతో కలిసి మూవీ వీక్షణ
- దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, హీరో నానికి కేటీఆర్ అభినందనలు

2

## 8 వేల ఎకరాల భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి: కేటీఆర్

- నేతన్నలు, రైతులు, విద్యార్థుల సమస్యలపై సమాధానం కోరిన కేటీఆర్
- హామీల అమలుకు స్పష్టమైన తేదీలు ప్రకటించాలని విజ్ఞప్తి
- సిరిసిల్ల అభివృద్ధిపై ప్రభుత్వం వివరాలు వెల్లడించాలని డిమాండ్

3

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పలు అంశాలపై స్పందించారు.



## కాంగ్రెస్‌లో అభ్యర్థుల ప్రకటనపై
# కొత్త పంచాయితీ

### రేవంత్ టీమ్‌లోనూ మహేష్‌గౌడ్ ప్రకటనపై చర్చ

- పరకాలలో రేవంత్ ప్రకటనపై అభ్యంతరాలు తెలిపిన మహేష్‌గౌడ్
- ఇప్పుడు తాను నిజామాబాద్ నుంచి పోటీ చేస్తానన్న పీసీసీ చీఫ్
- సొంత నియోజకవర్గం లేకపోవడంతో జిల్లా నేతల్లో మొదలైన టెన్షన్
- ఎవరి సీటుకు ఎర్త్ పెడతారోనని కాంగ్రెస్ నేతల్లో చర్చ

**హైదరాబాద్, సెప్టెంబరు 27:**
తెలంగాణ కాంగ్రెస్‌లో అభ్యర్థుల ముందస్తు ప్రకటన వ్యవహారం మరోసారి చర్చకు దారితీసింది. పరకాల పర్యటనలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుపై అప్పట్లో పార్టీలో పెద్ద దుమారమే రేగింది. సహజమైన కాంగ్రెస్ విధానానికి భిన్నంగా ఎన్నికలకు ముందే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారన్న ప్రశ్నలు పార్టీ నేతల నుంచి వచ్చాయి. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ సైతం ముందస్తుగా ఎవరైనా అభ్యర్థులను ప్రకటించినా అది చెల్లదని స్పష్టం చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది.

మిగతా 2వ పేజీలో..

## ఎల్‌పీయూ క్యాంపస్‌లో ఉద్రిక్తత

### అత్యాచారం, ఆత్మహత్య జరిగిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం



2

- నిరసనకు దిగిన విద్యార్థులు.. క్యాంపస్‌లో ఆస్తుల ధ్వంసం
- జలంధర్-ఫగ్వారా జాతీయ రహదారిపై బైఠాయింపు
- అత్యాచారం, ఆత్మహత్యపై ఫిర్యాదు లేదన్న పోలీసులు
- సోషల్ మీడియా ప్రచారం అవాస్తవమన్న వర్సిటీ యాజమాన్యం

## దానం తర్వాత ఎవరు?



- కడియం శ్రీహరి సహా మిగిలిన ఎమ్మెల్యేల కేసులపై పెరిగిన ఉత్కంఠ
- దానం అనర్హతను సమర్థించిన సుప్రీంకోర్టు
- 'ఫిక్స్‌డ్ డిపాజిట్.. షేర్ మార్కెట్' అంటూ ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్య
- మిగిలిన కేసుల్లోనూ అదే జరుగుతుందా అనే రాజకీయ చర్చ
- 8–9 ఉప ఎన్నికలంటూ ప్రచారం.. ఇప్పటికైతే ఊహాగానమే

**హైదరాబాద్, సెప్టెంబర్ 26:**
ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానం నాగేందర్‌పై అనర్హత వేటును సుప్రీంకోర్టు సమర్థించడంతో తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి మిగిలిన పార్టీ ఫిరాయింపు కేసులపై పడింది. ముఖ్యంగా కడియం శ్రీహరి విషయంలో ఏం జరగబోతోంది? ఇతర ఎమ్మెల్యేలపై దాఖలైన కేసులు ఎటువైపు వెళ్తాయి? మరిన్ని అసెంబ్లీ స్థానాలు ఖాళీ అవుతాయా? ఉప ఎన్నికలు వస్తాయా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. అయితే దానం కేసులో వచ్చిన తీర్పే మిగిలిన వారందరికీ యథాతథంగా వర్తిస్తుందని ఇప్పుడే నిర్ధారించలేం. ఒక్కో కేసులోని పరిస్థితులు, ఆధారాలు, ఎమ్మెల్యేల చర్యలు,

మిగతా 3వ పేజీలో..



## ఫిబ్రవరి 17 నుంచి మినీ మేడారం జాతర

- నాలుగు రోజులపాటు సమ్మక్క-సారలమ్మలకు ప్రత్యేక పూజలు
- 2027 ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు నిర్వహణ
- తేదీలు ప్రకటించిన మేడారం పూజారుల సంఘం
- • 19న భక్తుల దర్శనాలు, మొక్కుల చెల్లింపులు

2

## 41 కొత్త బార్లకు నోటిఫికేషన్



2

- జీహెచ్ఎంసీ పరిధిలో 14 బార్ల ఏర్పాటు
- ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 27
- సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు
- ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష రుసుము

## హోటళ్లపై టీజీ సేఫ్ కొరడా



3

## రైల్వే రూపురేఖలే మార్చేశాం



2

- మోదీ హయాంలో ఆధునికీకరణ వేగవంతమైందన్న అమిత్ షా
- దేశంలో తొలి ఎల్ఎన్‌జీ ఆధారిత రైలుకు పచ్చజెండా
- రూ.1,472 కోట్ల రైల్వే అభివృద్ధి పనులు ప్రారంభం
- రైల్వే నెట్‌వర్క్‌లో 99.6 శాతం విద్యుదీకరణ పూర్తి
- 2030 నాటికి డీజిల్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించడమే లక్ష్యం

# యూఎల్‌సీ దరఖాస్తులకు మోక్షం

**హైదరాబాద్, సెప్టెంబర్ 27:**

రాష్ట్రంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్హత కలిగిన దరఖాస్తులను పరిశీలించి నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ మెమో నెం.48062 జారీ చేసింది. ఈ విషయాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పెండింగ్ కేసుల పరిశీలన యూఎల్‌సీ దరఖాస్తులకు సంబంధించి 2016లోనే జీవోలు జారీ అయినప్పటికీ వాటి అమలు జరగకపోవడంతో వేలాది కేసులు పెండింగ్‌లో ఉండిపోయాయని మంత్రి తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు జీవో నెం.455, 456, 747, 92 కింద వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్హత ఉన్న కేసులను నిబంధనలకు అనుగుణంగా క్రమబద్ధీకరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. 22ఏ సమస్యలపైనా దృష్టి నిషేధిత ఆస్తుల జాబితాకు సంబంధించిన 22ఏ సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే ఈ అంశంపై మూడు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొంది. జీవో 118, జీవో 76కు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేయడంతో 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ చట్టపరమైన అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఉన్న అడ్డంకులను తొలగించినట్లు వెల్లడించింది. మిగిలిన 22ఏ భూ సమస్యలను కూడా ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది.

# ది ప్యారడైజ్'పై కేటీఆర్ ప్రశంసల జల్లు

- తెలంగాణ యాస, భాషతో సినిమా ఆకట్టుకుందంటూ ప్రశంస
- కేసీఆర్‌ను పోలిన 'శంకరన్న' పాత్ర సన్నివేశాలకు అభిమానుల సందడి

**హైదరాబాద్, సెప్టెంబరు 27:**

న్యాచురల్ స్టార్ నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన 'ది ప్యారడైజ్'పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ పిరియాడిక్ యాక్షన్ డ్రామా రెండు రోజుల్లోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటింది. తాజాగా కేటీఆర్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ 35ఎంఎం థియేటర్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో కలిసి సినిమాను వీక్షించారు.

**శ్రీకాంత్ ఓదెల, నానికి అభినందనలు**

సినిమా చూసిన అనంతరం కేటీఆర్ తన స్పందనను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. అస్థిత్వం కోసం ఆరాటం, అణిచివేతపై పోరాటం వంటి అంశాలను సినిమాలో బలంగా చూపించారని పేర్కొంటూ దర్శకుడు శ్రీకాంత్ ఓదెలను అభినందించారు. కథానాయకుడి పాత్రలో జీవించిన నానికి శుభాకాంక్షలు తెలిపారు. నటుడు ప్రియదర్శికి ప్రత్యేకంగా అభినందనలు చెబుతూ, ''చావు నోట్లో తల పెట్టయినా.. మీకు గుర్తింపు తెస్తా!!'' అంటూ సినిమాలోని భావోద్వేగ అంశాన్ని ప్రస్తావించారు.

**'శంకరన్న' సన్నివేశాలకు సందడి**

'ది ప్యారడైజ్'లో కేసీఆర్‌ను పోలిన ఎమ్మెల్యే శంకరన్న పాత్ర కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ పాత్రకు సంబంధించిన సన్నివేశాలు తెరపై కనిపించగానే అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సైతం చిరునవ్వు చిందించారు. సినిమా ముగిసిన అనంతరం థియేటర్ బయట మాట్లాడిన ఆయన.. ఒక సమాజంపై అణిచివేత జరిగినప్పుడు ఓ నాయకుడు ముందుకొచ్చి పోరాటం చేసి ఆ సమాజానికి గుర్తింపు తీసుకురావడం ప్రధానాంశంగా సినిమా తెరకెక్కిందని, కథ అద్భుతంగా ఉందని అన్నారు. తెలంగాణ నేపథ్యం, యాస, భాషను సినిమాలో సహజంగా మేళవించడం ఆకట్టుకుందని ప్రశంసించారు.

# కాంగ్రెస్‌లో అభ్యర్థుల ప్రకటనపై కొత్త పంచాయితీ

**మొదటిపేజీ తరువాయి**

ప్రకటించినా అది చెల్లదని స్పష్టం చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఇప్పుడు అదే అంశాన్ని గుర్తు చేస్తూ కాంగ్రెస్‌లో మరో వాదన తెరపైకి వచ్చింది. పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా నుంచి పోటీ చేస్తానని మహేష్‌గౌడ్ ప్రకటించారు. అయితే ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారో తర్వాత వెల్లడిస్తానని చెప్పారు.

**ఎవరి సీటుకు ఎర్త్?**

మహేష్‌గౌడ్ ప్రకటన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో మాత్రం అలజడి రేపింది. సొంత జిల్లా అయినప్పటికీ ఆయనకు ప్రస్తుతం నిర్దిష్టంగా సొంత నియోజకవర్గం లేదు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలు లేదా పార్టీ ఇన్‌చార్జులు కొనసాగుతున్నారు. దీంతో పీసీసీ చీఫ్ పోటీకి దిగితే ఎవరికి ఇబ్బంది ఎదురవుతుందనే చర్చ మొదలైంది. ఇదే క్రమంలో పరకాల వ్యవహారాన్ని కొందరు నేతలు ప్రస్తావిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను తిరిగి గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చినప్పుడు ముందస్తు అభ్యర్థిత్వ ప్రకటనపై అభ్యంతరం వ్యక్తం చేసిన పీసీసీ చీఫ్.. ఇప్పుడు తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని ఎలా ప్రకటిస్తారన్న ప్రశ్నను జిల్లా నేతలు లేవనెత్తుతున్నారు.

**ఆర్మూర్‌పై అప్పట్లో చర్చ**

మహేష్‌గౌడ్‌కు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచన ఎప్పటి నుంచో ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ ఉంది. ఆర్మూర్ నుంచి ఆయన బరిలో దిగవచ్చన్న ప్రచారం కూడా గతంలో జరిగింది. తాజాగా నిజామాబాద్ జిల్లా నుంచి పోటీ చేస్తానని స్వయంగా చెప్పడంతో ఆ చర్చ మళ్లీ ఊపందుకుంది. మహేష్‌గౌడ్ ఏ నియోజకవర్గాన్ని ఎంచుకుంటారన్నది స్పష్టత రావాల్సి ఉన్నప్పటికీ.. ఆయన ప్రకటనతో జిల్లా కాంగ్రెస్‌లో మాత్రం ముందస్తుగానే రాజకీయ లెక్కలు మొదలయ్యాయి. ఇదే అంశంపై రేవంత్ వర్గం నేతలు కూడా అంతర్గతంగా చర్చిస్తున్నట్లు సమాచారం. దీంతో కాంగ్రెస్‌లో అభ్యర్థుల ఎంపికపై మరోసారి గరంగరం చర్చ సాగుతోంది.

# ఫిబ్రవరి 17 నుంచి మినీ మేడారం జాతర

**ములుగు, సెప్టెంబర్ 27:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మేడారంలో శ్రీ సమ్మక్క సారలమ్మ మినీ జాతర తేదీలు ఖరారయ్యాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో 2027 ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు నాలుగు రోజులపాటు జాతర నిర్వహించనున్నట్లు పూజారుల (వడ్డెలు) సంఘం ప్రకటించింది. ఈ మేరకు జాతర తేదీలు, కార్యక్రమాల వివరాలను రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రికి లేఖ ద్వారా తెలియజేసింది.

నాలుగు రోజులపాటు పూజలు ఫిబ్రవరి 17న సంప్రదాయ పూజలతో మినీ జాతర ప్రారంభం కానుంది. 18న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 19న భక్తుల దర్శనాలు, మొక్కుల చెల్లింపులకు అవకాశం కల్పిస్తారు. 20న ముగింపు ఉత్సవాలతో జాతర పూర్తవుతుంది. ఆదివాసీ గిరిజన సంప్రదాయాల ప్రకారం మేడారంలో సమ్మక్కసారలమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీ. రెండేళ్లకోసారి మహాజాతర నిర్వహిస్తుండగా, అది లేని మరుసటి ఏడాది మినీ జాతర జరుగుతుంది. మహాజాతర సమయంలో రద్దీ కారణంగా అమ్మవార్లను దర్శించుకోలేని వారు, మొక్కులు చెల్లించుకోలేని భక్తులు మినీ జాతరకు పెద్ద సంఖ్యలో మేడారం చేరుకుంటారు.

# ఎల్‌పీయూ క్యాంపస్‌లో ఉద్రిక్తత

**చండీగఢ్, సెప్టెంబర్ 27:**



పంజాబ్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పీయూ) క్యాంపస్‌లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓ విద్యార్థినిపై నిర్మాణ కార్మికులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని, అనంతరం ఆమె ఆత్మహత్య చేసుకుందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు నిరసనకు దిగారు. అయితే అలాంటి ఘటన జరిగినట్లు తమకు ఎలాంటి సమాచారం లేదా ఫిర్యాదు అందలేదని పోలీసులు స్పష్టం చేశారు. అదుపుతప్పిన నిరసన క్యాంపస్‌లో గుమిగూడిన విద్యార్థులు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. కొద్దిసేపటికే నిరసన ఉద్రిక్తంగా మారడంతో గాజు కిటికీలు, పూలకుండీలు ధ్వంసమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో మంటలు చెలరేగాయి. అనంతరం విద్యార్థులు జలంధర్‌ఫగ్వారా జాతీయ రహదారిని దిగ్బంధించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఫిర్యాదు రాలేదు: పోలీసులు క్యాంపస్‌లో అత్యాచారం లేదా ఆత్మహత్య జరిగినట్లు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదని కపుర్థలా ఎస్ఎస్పీ గౌరవ్ తూరా తెలిపారు. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఆరోపణలకు ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. విద్యార్థులు, యూనివర్సిటీ యాజమాన్యంతో చర్చించి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. క్యాంపస్‌లో జరిగిన ఆస్తి నష్టంపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరోవైపు విద్యార్థులంతా సురక్షితంగా ఉన్నారని ఎల్‌పీయూ యాజమాన్యం ప్రకటించింది. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని పేర్కొంటూ సర్క్యులర్ విడుదల చేసింది. విద్యార్థులు నిరసనలకు దూరంగా ఉండాలని, హాస్టల్ గదుల్లోనే ఉండి క్యాంపస్‌లో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు సహకరించాలని సూచించింది.

# 41 కొత్త బార్లకు నోటిఫికేషన్



**హైదరాబాద్, సెప్టెంబరు 27:**

తెలంగాణలో కొత్తగా 41 టూబీ (2B) బార్ లైసెన్సుల జారీకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి, అర్హత ఉన్న వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. సోమవారం నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష ఫీజుగా నిర్ణయించారు.

**జీహెచ్ఎంసీ పరిధిలో 14**

మొత్తం 41 కొత్త 2B బార్లలో 14 జీహెచ్ఎంసీ పరిధిలో ఏర్పాటు చేయనున్నారు. మరో 27 బార్లను రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు చేయనున్నట్లు శాఖ వెల్లడించింది. నిర్ణీత ఫీజు చెల్లించి, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.

**లైసెన్సుకు నిబంధనలు**

2B బార్ లైసెన్సుల మంజూరుకు ఎక్సైజ్ శాఖ నిర్దేశించిన ప్రక్రియను అనుసరించాలి. ప్రీక్లియరెన్స్‌కు ఫారమ్ 1(ఏ), అనంతరం లైసెన్స్ దరఖాస్తుకు ఫారమ్ 1(బీ) తదితర నిబంధనలు వర్తిస్తాయి. బార్ ఎక్సైజ్ పన్ను ఆయా ప్రాంతాల జనాభా ఆధారంగా నిర్ణయిస్తారు. లైసెన్స్ పొందిన వారు మద్యం విక్రయ సమయాలు, వయోపరిమితి, ఇతర ఎక్సైజ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.

# కాంగ్రెస్ ఓడితే ఈవీఎంలపై నిందలు: కిషన్‌రెడ్డి

- గెలిస్తే ఘనత.. ఓడితే ఈవీఎంలు, ఈసీపై ఆరోపణలా?
- రాజ్యాంగ వ్యవస్థలపై రాహుల్ నిరాధార ప్రచారం చేస్తున్నారంటూ విమర్శ
- ''రాహుల్‌ను ప్రధాని చేయాల్సిన బాధ్యత ఈవీఎంలకు లేదు''
- ఎమర్జెన్సీ చరిత్ర ఉన్న కాంగ్రెస్‌కు రాజ్యాంగంపై మాట్లాడే హక్కు లేదని వ్యాఖ్య
- ఎస్ఐఆర్ ప్రక్రియపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే చర్యలని వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబరు 27:**

బీజేపీ ఎప్పుడూ ఓట్లను చోరీ చేయదని, దేశ ప్రజల మనసులను గెలుచుకుంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే దాన్ని తమ ఘనతగా చెప్పుకోవడం, ఓటమి ఎదురైతే ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై నిందలు వేయడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**ఈసీపై ఆరోపణలు సరికాదు**

కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణలో ఎన్నికల సంఘం సక్రమంగా పనిచేస్తోందని చెప్పి.. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధిస్తే మాత్రం ఈవీఎంలు, ఎన్నికల సంఘాన్ని తప్పుబట్టడం ఆ పార్టీ అపరిపక్వతకు నిదర్శనమని కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం, రాజ్యాంగ వ్యవస్థలపై రాహుల్‌గాంధీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు. ''రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాల్సిన బాధ్యత ఈవీఎంలకు లేదు'' అని వ్యాఖ్యానించారు. 1975లో ఎమర్జెన్సీ విధించి పౌర హక్కులను కాలరాసిన కాంగ్రెస్‌కు రాజ్యాంగంపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.

**రేవంత్‌పై విమర్శలు**

తెలంగాణ ప్రజలు ఓటేసి గెలిపించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇతర రాష్ట్రాలకు వెళ్లి సోనియాగాంధీ కుటుంబం కోసం ప్రాణాలు అర్పిస్తానని చెప్పడం సిగ్గుచేటని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రజల సమస్యలను పట్టించుకోకుండా గాంధీ కుటుంబ సేవలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. ఆర్మీ చీఫ్, సర్జికల్ స్ట్రైక్స్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, లోక్‌సభ స్పీకర్, సీజేఐ, ఈడీ, సీబీఐ, పార్లమెంట్, జీఎస్టీ వంటి వ్యవస్థలపై రాహుల్‌గాంధీ అనుమానాలు వ్యక్తం చేస్తూ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని తమ కుటుంబమే పాలించాలనే రాచరిక ధోరణి ఆయన వ్యాఖ్యల్లో కనిపిస్తోందని అన్నారు.

**మోదీ పాలనపై ప్రస్తావన**

నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. పేదరిక నిర్మూలన, మౌలిక వసతుల అభివృద్ధి, ఉచిత రేషన్ వంటి సంక్షేమ కార్యక్రమాలతో కోట్లాది మందికి ప్రయోజనం కలిగిందని చెప్పారు. మోదీ పాలనలో అవినీతి ఆరోపణలు లేవని పేర్కొన్నారు. స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు బీజేపీకి మద్దతు ఇస్తున్నారని, కాంగ్రెస్ ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

**ఎస్ఐఆర్‌పై కిషన్‌రెడ్డి వివరణ**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై స్పందిస్తూ పశ్చిమ బెంగాల్‌లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు. చనిపోయిన వారు, వలస వెళ్లినవారు, డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించే ప్రక్రియను రాజకీయ లబ్ధి కోసం తప్పుబట్టడం సరికాదన్నారు. ఎన్నికల వ్యవస్థలోని లోపాలను సరిదిద్దే చర్యలను స్వాగతించాలని కోరారు. గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంపై ఉత్సవ సమితి, పోలీసు, మున్సిపల్ సిబ్బంది, నగర ప్రజలకు కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# శక్కర్ నగర సీఎస్ఐ చర్చిలో వయోవృద్ధుల ఆరాధనోత్సవం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 27 :**

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ సీఎస్ఐ సెయింట్ పాల్ చర్చిలో వయోవృద్ధుల ఆరాధన కార్యక్రమాన్ని ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పరిధిలోని 65 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులను రెవ. ఎం. ప్రభాకర్ పాస్టర్, రెవ. డి.జ్యోతి రాజ్ చేతుల మీదుగా శాలువాలతో ఘనంగా సన్మానించి, చిన్న కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా దైవజనులు మాట్లాడుతూ.. చర్చి అభివృద్ధిలోనూ, ఆధ్యాత్మిక వృద్ధిలోనూ వయోవృద్ధుల పాత్ర ఎంతో కీలకమైనదని, వారి ప్రార్థనలు, అనుభవం సంఘానికి కొండంత బలమని పేర్కొన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారు దాదాపు 70 మందికి పైగా ఈ సంఘంలో ఉండటం దేవుడు ఇచ్చిన గొప్ప దీవెనగా భావిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ సిటిజన్స్ ఆరాధన మరియు సీఎస్ఐ ఫార్మేషన్ డే పక్షాన పాల్గొన్న వయోవృద్ధులందరినీ అభినందిస్తూ దైవాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టరేట్ కమిటీ బాధ్యులు బి.ఎడ్వర్డ్ ముల్లర్, కె.పుష్పరాజ్, ఆర్.పి.యేసుదాస్, డి.పద్మ జ్యోతి, జి.సునీత డేవిడ్, బి.సుమన సాగర్, బి.సంపత్ కుమార్, బి. జయవంత్ లతో పాటు చర్చి కమిటీ ప్రతినిధులు, ప్రార్థనా బృందం, సోదరీ సోదరులు పాల్గొన్నారు.

# రైల్వే రూపురేఖలే మార్చేశాం

**అహ్మదాబాద్, సెప్టెంబర్ 27:**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారతీయ రైల్వేలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. విద్యుదీకరణ, ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం, ఆధునిక రైల్వే వ్యవస్థలు, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కుంభకోణాలు, అవినీతి చోటుచేసుకున్నాయని కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. తొలి ఎల్ఎన్‌జీ రైలు ప్రారంభం గుజరాత్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్‌లో దేశంలోనే తొలి ఎల్ఎన్‌జీ ఆధారిత రైలుకు అమిత్ షా పచ్చజెండా ఊపారు. రూ.1,472 కోట్ల విలువైన వివిధ రైల్వే అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. రూ.700 కోట్లతో నిర్మించిన WAG12 లోకోమోటివ్ మెయింటెనెన్స్ షెడ్‌ను ప్రారంభించారు. సబర్మతికలోల్‌సబర్మతి సెక్షన్‌లో రూ.48 కోట్లతో 'కవచ్' రక్షణ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. అహ్మదాబాద్‌పాలన్‌పూర్, అహ్మదాబాద్‌సమాఖ్యాలి మార్గాల్లో కవచ్ పనులు, సబర్మతిసర్ఖేజ్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులను చేపట్టారు. 99.6 శాతం విద్యుదీకరణ దేశంలో రైల్వే విద్యుదీకరణ 99.6 శాతానికి చేరిందని అమిత్ షా తెలిపారు. మిగిలిన 0.4 శాతాన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. 201011లో ఏడాదికి 75 కిలోమీటర్ల మేర విద్యుదీకరణ జరగ్గా, 202324 నాటికి అది 7,188 కిలోమీటర్లకు పెరిగిందని చెప్పారు. రైల్వేలో డీజిల్ వినియోగం 201516లో 293 కోట్ల లీటర్లు ఉండగా, 202425 నాటికి 108 కోట్ల లీటర్లకు తగ్గిందన్నారు. భవిష్యత్తులో డీజిల్‌పై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. 12 వేల హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన WAG 12 లోకోమోటివ్ దాదాపు 600 ట్రక్కులకు సమానమైన సరుకును తరలించగలదని షా తెలిపారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు, రాపిడ్ రైల్ వ్యవస్థలు, ఆధునిక స్టేషన్ల అభివృద్ధితో రైల్వే సామర్థ్యం పెరుగుతోందన్నారు. ముంబై సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు నుంచి వడోదర వరకు లాంగ్‌హాల్ డబుల్ స్టాక్ కంటైనర్ రైలు ట్రయల్ విజయవంతమైనట్లు చెప్పారు. సుమారు 11 వేల కిలోమీటర్ల కారిడార్‌ను నాలుగు లైన్ల నెట్‌వర్క్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. గుజరాత్‌కు రైల్వే కేటాయింపులు 200914 మధ్య రూ.589 కోట్లు ఉండగా, 202627లో రూ.17,366 కోట్లకు చేరాయని అమిత్ షా తెలిపారు. కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



# దానం తర్వాత ఎవరు?

**మొదటిపేజీ తరువాయి**

స్పీకర్ ఇచ్చిన నిర్ణయాలను న్యాయస్థానాలు విడివిడిగా పరిశీలించాల్సి ఉంటుంది.

**దానం కేసులో కీలక మలుపు**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ విజయం సాధించారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరిన ఆయన, ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు, స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానంపై అనర్హత వేటు వేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయన అనర్హుడని పేర్కొంటూ ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటించింది. దీనిని సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించగా అక్కడా ఉపశమనం దక్కలేదు. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. ఎమ్మెల్యే పదవిని 'ఫిక్స్‌డ్ డిపాజిట్'తో, ఎంపీగా పోటీ చేయడాన్ని 'షేర్ మార్కెట్'తో పోలుస్తూ వ్యాఖ్యానించారు. 'ఆయా రామ్.. గయా రామ్.. ఫిర్ ఆయా రామ్' అంటూ కూడా వ్యాఖ్య చేశారు. దానం తిరిగి బీఆర్ఎస్‌లోకి వస్తే సభ్యత్వం కొనసాగుతుందన్న వాదనను ధర్మాసనం అంగీకరించలేదు.

**కడియంపై ఇప్పుడు ఫోకస్**

దానం వ్యవహారం తేలడంతో కడియం శ్రీహరి సహా పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతర ఎమ్మెల్యేల పరిస్థితిపై ఉత్కంఠ నెలకొంది. దానం, కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆధారాలు లేవన్న కారణంతో స్పీకర్ గతంలో తిరస్కరించారు. ఇతర పలువురు ఎమ్మెల్యేల విషయంలోనూ అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. దానం విషయంలో మాత్రం హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టగా, ఆ తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. దీంతో మిగిలిన కేసుల్లో న్యాయస్థానాలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయన్నది కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 8-9 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు వస్తాయన్న ప్రచారం కూడా జరుగుతోంది. అయితే వాటిని ఖాయంగా చెప్పడానికి ప్రస్తుతం న్యాయపరమైన ఆధారం లేదు. దానం కేసులో ఆయన కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అంశం కీలకంగా నిలిచింది. మిగిలిన ఎమ్మెల్యేలపై ఉన్న ఆరోపణలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, స్పీకర్ నిర్ణయాలు వేర్వేరుగా ఉండటంతో ఆయా కేసుల ఫలితాలు న్యాయ ప్రక్రియపైనే ఆధారపడి ఉంటాయి. బీఆర్ఎస్ నేతలు మాత్రం మిగిలిన ఎమ్మెల్యేలపైనా అనర్హత వేటు పడుతుందని చెబుతున్నారు. అది ప్రస్తుతానికి ఆ పార్టీ వాదనే తప్ప న్యాయస్థానాల నిర్ణయం కాదు. దానం తీర్పుతో తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరోసారి ప్రధాన రాజకీయ, న్యాయ చర్చగా మారింది. ఒక పార్టీ గుర్తుపై ఎన్నికై మరో పార్టీతో రాజకీయంగా కొనసాగితే ప్రజలు ఇచ్చిన మాండేట్ పరిస్థితి ఏమిటన్న ప్రశ్న కూడా ముందుకొస్తోంది. కడియం శ్రీహరి సహా మిగిలిన ఎమ్మెల్యేల కేసుల్లో ఏం తేలుతుంది? మరిన్ని స్థానాలు ఖాళీ అవుతాయా? ఉప ఎన్నికలకు దారితీస్తుందా? అన్న ప్రశ్నలకు రాబోయే న్యాయపరమైన పరిణామాలే సమాధానం చెప్పనున్నాయి.

# రూ.16 కోట్ల చిట్టీల మోసం.. కుటుంబం పరార్

- **చిట్టీలు, అధిక వడ్డీల పేరుతో 44 మంది నుంచి వసూళ్లు**
- **రమణారెడ్డి, భార్య సీత, కుమార్తె హరీషా రెడ్డిపై ఆరోపణలు**
- **ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఇంటికి తాళం వేసి పరారీ**
- **సైబరాబాద్ ఈఓడబ్ల్యూ ఆధ్వర్యంలో దర్యాప్తు**
- **మొత్తం బాధితుల బకాయిలు రూ.70 కోట్ల వరకు ఉంటాయని ఆరోపణ**




**హైదరాబాద్, సెప్టెంబరు 27:**

కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చిట్టీల మోసం వెలుగుచూసింది. చిట్టీలు, అధిక వడ్డీల పేరుతో దాదాపు 44 మంది నుంచి రూ.16 కోట్లకు పైగా వసూలు చేసిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పరారైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేపీహెచ్‌బీకి చెందిన రమణారెడ్డి, ఆయన భార్య సీత, కుమార్తె హరీషా రెడ్డి ఈ వ్యవహారంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

**ఫోన్లు స్విచ్ఛాఫ్.. ఈఓడబ్ల్యూ దర్యాప్తు**

బాధితులు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి పెంచడంతో నిందితులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి, ఇంటికి తాళం వేసి కనిపించకుండా పోయినట్లు సమాచారం. దీంతో మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న సైబరాబాద్ ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల బ్యాంకు ఖాతాలు, లావాదేవీలు, కాల్ డేటా తదితర వివరాలను పరిశీలిస్తూ ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి.

**పెళ్లిళ్లు, ఇళ్ల కోసం దాచుకున్న సొమ్ము**

రమణారెడ్డి కుటుంబంతో తమకు చాలాకాలంగా పరిచయం ఉండటంతో పూర్తి నమ్మకంతో డబ్బులు అప్పగించామని బాధితులు చెబుతున్నారు. కుమార్తెల పెళ్లిళ్ల కోసం, ఇళ్ల నిర్మాణాల కోసం దాచుకున్న సొమ్మును చిట్టీల్లో పెట్టామని, ఇప్పుడు ఆ డబ్బు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో బాధితుల సంఖ్య 44 మందికి మించి ఉండొచ్చని, తమకు రావాల్సిన మొత్తం రూ.70 కోట్ల వరకు ఉంటుందని మరికొందరు ఆరోపిస్తున్నారు. నిందితులను త్వరగా పట్టుకుని తమ సొమ్మును రికవరీ చేయాలని బాధితులు పోలీసులను కోరుతున్నారు.

# ఆరోపణలకు ఆధారాలెక్కడ..?

- **ఆర్పీ వ్యవహారంతో మాకు సంబంధమే లేదు..**
- **కాంగ్రెస్ ఒత్తిడికి ఆధారాలుంటే చూపాలి..**
- **రుజువు చేయకపోతే న్యాయపరమైన చర్యలు తప్పవు కౌన్సిలర్ రజిత హెచ్చరిక..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి**
**సెప్టెంబర్ 27 (సిరి న్యూస్)**



6వ వార్డు కౌన్సిలర్ రజిత తనపై, తన భర్తపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆరోపణలకు ఆధారాలు చూపించాలని ఒక రోజు సమయం ఇచ్చినా ఇప్పటివరకు ఒక్క ఆధారం కూడా చూపలేదని పేర్కొన్నారు. 6వ వార్డు ఆర్పీ వ్యవహారంతో తమకు ఎలాంటి సంబంధం లేదని, అది మెప్మా విభాగానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. ఆర్పీ వ్యవహారంపై అధికారులు ఇప్పటికే విచారణ జరిపి చర్యలు తీసుకున్నారని తెలిపారు. తమ ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. తన భర్త కౌన్సిలర్ రజితను కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఒత్తిడి చేశారని, బెదిరించారని చేసిన ఆరోపణలు కూడా పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. వాటికి ఆధారాలు చూపిస్తే ఎలాంటి చర్యలకైనా సిద్ధమని స్పష్టం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రజితకు మరో రోజు సమయం ఇస్తున్నామని, ఆరోపణలను నిరూపించకపోతే న్యాయపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఆరోపణలకు సమయం కేటాయించే బదులు ఎన్నికల్లో గెలిపించిన 6వ వార్డు ప్రజల సంక్షేమం, వార్డు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు..

# అన్నీ తానై..

## నిమజ్జనాన్ని విజయవంతం చేసిన కౌన్సిలర్ గజవాడ నాగరాజు



- **గజవాడ నాగరాజుకు తోడుగా సీఐ సైదా, ఎస్సై బాలరాజు**
- **కమిషనర్ రవీందర్..**

**రామాయంపేట, సెప్టెంబర్ 27 (సిరి న్యూస్ )**



రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో 13 రోజులపాటు ఘనంగా నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు, అనంతరం మూడు రోజులపాటు కొనసాగిన వినాయక నిమజ్జన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు కీలకపాత్ర పోషించారు. మున్సిపల్ పాలకవర్గం, వివిధ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ఉత్సవాల నిర్వహణలో ఆయన ముందుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 100 వినాయక మండపాలు ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. 13 రోజులపాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీరు తదితర సౌకర్యాలపై కౌన్సిలర్ నాగరాజు ప్రత్యేక దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేస్తూ సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించారు.

**నాగరాజుకు అధికారుల సహకారం**

వినాయక నిమజ్జన కార్యక్రమం విజయవంతం చేయడంలో కౌన్సిలర్ నాగరాజుకు సీఐ సైదా, ఎస్సై బాలరాజు పోలీస్ శాఖ తరపున పూర్తి సహకారం అందించారు. నిమజ్జన మార్గాల్లో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ సిబ్బందితో ప్రత్యేక చర్యలు చేపట్టారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ మున్సిపల్ సిబ్బందిని సమన్వయం చేస్తూ పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, నిమజ్జన ప్రాంతంలో అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కౌన్సిలర్ నాగరాజు, సీఐ సైదా, ఎస్సై బాలరాజు, కమిషనర్ రవీందర్ సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలు సజావుగా సాగాయి.

**సర్వాయికుంట వద్ద ప్రత్యేక ఏర్పాట్లు**

మూడు రోజులపాటు జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమం సందర్భంగా సర్వాయికుంట వద్ద భక్తులు, నిర్వాహకులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖల అధికారులతో సమన్వయం చేస్తూ భద్రతా చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచి నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

**అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం. డి.ఎస్.పి నరేందర్ గౌడ్**

నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా పూర్తికావడంతో డీఎస్పీ నరేందర్ గౌడ్ అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని అభినందించారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, ఫైర్, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖల సమన్వయంతో ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు. మూడు రోజులపాటు నిమజ్జన ఏర్పాట్లలో శ్రమించిన మున్సిపల్ సిబ్బందిని కౌన్సిలర్ నాగరాజు అభినందించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. మొత్తంగా కౌన్సిలర్ గజవాడ నాగరాజు సమన్వయానికి పోలీస్ శాఖలో సీఐ సైదా, ఎస్సై బాలరాజు, మున్సిపల్ శాఖలో కమిషనర్ రవీందర్ సహకారం తోడవడంతో రామాయంపేటలో వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా విజయవంతంగా ముగిశాయి.




# హోటళ్లపై టీజీ సేఫ్ కొరడా

- **20 హోటళ్లు, రెస్టారెంట్లలో ఏకకాలంలో తనిఖీలు**
- **నిబంధనల ఉల్లంఘనతో 11 సంస్థల ఫుడ్ లైసెన్సులు సస్పెండ్**
- **మరో ఆరింటికి ఇంప్రూవ్‌మెంట్, మూడింటికి షోకాజ్ నోటీసులు**
- **వంటశాలల్లో బొద్దింకలు, ఎలుకలు.. కుళ్లిన ఆహార పదార్థాలు**
- **ఆదేశాలు బేఖాతర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక**

**హైదరాబాద్, సెప్టెంబరు 27:**

నగరంలోని ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనపై తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎస్సెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) అధికారులు కొరడా ఝుళిపించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 10 ప్రత్యేక బృందాలు గచ్చిబౌలి, మాధాపూర్, హైటెక్‌సిటీ పరిధిలోని 20 ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో శనివారం ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. తీవ్రమైన ఉల్లంఘనలు గుర్తించిన 11 సంస్థల ఫుడ్ లైసెన్సులను సస్పెండ్ చేసి, కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు. మరో ఆరు సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు, మూడింటికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

**వంటశాలల్లో అపరిశుభ్రత**

తనిఖీల్లో పలు రెస్టారెంట్ల వంటశాలల్లో ఆహార భద్రత ప్రమాణాల దారుణ పరిస్థితులు బయటపడ్డాయి. హైటెక్‌సిటీలోని మొనాస్టరీలో ఫంగస్ పట్టిన కూరగాయలు, కుళ్లిన గుడ్లు, లేబుల్స్ లేని ఉత్పత్తులు గుర్తించారు. గచ్చిబౌలిలోని శివాని ది రెస్టారెంట్ అండ్ బార్‌లో మురికిగా ఉన్న కిచెన్ ఫ్లోర్, పురుగులు పట్టిన ధాన్యాలు లభించాయి. అల్ సబా రెస్టారెంట్‌లో జిడ్డుపట్టిన చిమ్నీలు, సిగరెట్ బడ్స్, గుట్కా నములుతున్న సిబ్బందితో పాటు ఫ్రిజ్‌లలో ఉడికించిన ఆహారం, పచ్చి మాంసాన్ని కలిపి ఉంచినట్లు గుర్తించారు. మాధాపూర్‌లోని లక్కీ మల్టీకుసిన్, సాయి రామ్ మెస్‌లలో అపరిశుభ్రమైన ఫ్రిజ్‌లు, పురుగులు పట్టిన మైదా, మినప్పప్పును గుర్తించి అక్కడికక్కడే తొలగించారు. ఉడుపీస్ ఉపహార్‌లో డ్రెయిన్లు బ్లాక్ కావడంతో దుర్వాసన రావడంతో పాటు ఎలుకల సంచారం గుర్తించారు. కోల్ స్పార్క్‌లో ఫంగస్ పట్టిన 22 కిలోల వేరుశెనగలు, 25 కిలోల మిరియాలు, 8.9 కిలోల జీడిపప్పును స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు.

**లైసెన్సుల సస్పెన్షన్**

కాంచీ కేఫ్‌లో సాలెగూళ్లతో కూడిన సీలింగ్, పాడైన ముడిసరుకులు బయటపడగా.. ఇనార్బిట్ మాల్‌లోని అమ్ ఆహా తెలుగు కిచెన్‌లో ఎలుకలు కొరికిన మయోనైజ్ ప్యాకెట్లు, ఆహార పదార్థాల్లో బొద్దింకలు కనిపించాయి. అదే మాల్‌లోని ఫ్యూజన్ 9, ఆమ్నీషియా స్కై బార్‌లో ఎలుకల మల విసర్జన ఆనవాళ్లు, ఫంగస్ పట్టిన క్యారెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు అందుకున్న వాటిలో మాధాపూర్‌లోని రమేశ్వరం కేఫ్, గచ్చిబౌలిలోని ఇష్టా (విరున్తా ఫుడ్స్), సాహిబ్స్ బార్బెక్యూ, పక్కా లోకల్, గచ్చిబౌలి హోటల్ షాదాబ్, షా ఘౌస్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఆయా సంస్థల్లో త్వరలో పునఃతనిఖీలు నిర్వహించి, పారిశుద్ధ్య చర్యలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. తనిఖీల్లో హోటల్ అవసా, మినర్వా గ్రాండ్, 63 డిగ్రీస్ మోడర్న్ రీజినల్ బఫే వంటి ఇతర ప్రముఖ సంస్థల వంటశాలలను కూడా పరిశీలించినట్లు టీజీ సేఫ్ అధికారులు వెల్లడించారు. అధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తూ కార్యకలాపాలు కొనసాగించే సంస్థలపై తదుపరి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

# 8 వేల ఎకరాల భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి: కేటీఆర్

**సిరిసిల్ల, సెప్టెంబర్ 27:**



ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు వస్తున్న సందర్భంగా రాజకీయ విమర్శలకు బదులుగా ప్రజల సమస్యలపై సమాధానాలు చెప్పాలని కోరారు. సిరిసిల్ల అభివృద్ధి, భూముల వివాదాలు, నేత కార్మికుల సమస్యలు, ఎన్నికల హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ నాయకులు 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని, అందులో 2,400 ఎకరాలు తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని కేటీఆర్ కోరారు. ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబరు, ఎవరి పేరుపై ఎంత భూమి ఉందో ప్రజలకు తెలియజేస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆరోపణల్లో నిజం ఉంటే ఆధారాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని, లేకపోతే సిరిసిల్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ అన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో రైతుల అభ్యర్థనల మేరకు మాత్రమే రికార్డులు సవరించామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లాలో జరిగిన భూ పంపిణీ వివరాలను కూడా వెల్లడించారు. సిరిసిల్ల నేత కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకం, పాఠశాల దుస్తులు, కేసీఆర్ కిట్, పండుగ కానుకలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్ల ద్వారా ఉపాధి కల్పించిందని కేటీఆర్ తెలిపారు. దీంతో మరమగ్గాల పరిశ్రమ బలోపేతమై వేలాది కుటుంబాలకు ఉపాధి లభించిందని పేర్కొన్నారు. వస్త్రోత్పత్తి రంగంలో సిరిసిల్ల ప్రత్యేక గుర్తింపు సాధించిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి నేత కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపిందని కేటీఆర్ ఆరోపించారు. పెండింగ్ బకాయిల చెల్లింపులు, నూలు రాయితీ, వస్త్ర పరిశ్రమకు అవసరమైన ముడి సరుకు సరఫరాపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. నేత కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నేతన్నలు, రైతులు, విద్యార్థులు సహా అన్ని వర్గాలకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని కేటీఆర్ కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కాలపట్టిక ప్రకటించాలని, సిరిసిల్ల అభివృద్ధిపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ముందుంచిన వాగ్దానాల అమలుపై ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు.

# బిజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆర్. సాయిబాబా గౌడ్

**మెదక్ సెప్టెంబర్,27(సిరి న్యూస్)**



భారతీయ జనతా పార్టీ యువ మోర్చా(బిజేవైఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి గా మెదక్ మండలం బొల్లారం గ్రామానికి చెందిన వార్డు సభ్యులు రామస్వామి సాయిబాబా గౌడ్ ను నియమిస్తూ ఆదివారం బిజేవైఎం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సాయిబాబా గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో యువత, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులను వెంటనే విడుదల చేయాలని అయన డిమాండ్ చేశారు. తనకు వచ్చిన పదవితో మరింత బాధ్యత పెరిగిందిన్నారు.తన ఎన్నికకు కృషిచేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావ్, బిజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కొండి గణేష్ బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

# గొప్ప గాంధేయ వాది కొండా లక్ష్మణ్ బాపూజీ



- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 27, (సిరి న్యూస్)**

తొలి, మలి దశ ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేసిన గొప్ప గాంధేయవాది కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా పద్మశాలి సంఘం పటాన్ చెరు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మూడు తరాల పాటు అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. జాతికి వారు చేసిన సేవలను భవిష్యత్తు తరాలకు అందించాలన్న సమన్నత లక్ష్యంతో పటాన్ చెరు లో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన అదృష్టం తనకు దక్కిందన్నారు. బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, రామచంద్రా రెడ్డి, వంగరి అశోక్, కంకర శీనయ్య, వెంకటేష్, శంకర్, పద్మశాలి సంఘం ప్రతినిధులు రఘురాములు, ధర్మచంధ్, పశుపతి, గీతా వెంకట్, మధు, లక్ష్మణ్, కృష్ణ, వర ప్రసాద్, రాములు, జగదీష్, లక్ష్మణ్, నాగరాజు, సతీష్, విజయ్, పట్టణ నాయకులు, కార్యకర్తలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# తుంబురేశ్వర దేవాలయం లో ప్రత్యేక పూజలు



**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 27, (సిరి న్యూస్);**

అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని మెదక్ జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు టేక్మాల్ మండలం లోని వేల్పుగొండ లో స్వయంభూగా వెలసిన సుప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీ తుబురేశ్వర ఆలయం లో విశేష పూజలు బతుకమ్మ ఆటలు, బోనాలు, నిర్వహించారు. ఆలయం లో కాకతీయుల కట్టడాలు చెక్కు చెదరకుండా నేటికి అలాగే ఉన్నాయి. ఆలయం లో నేడు అధికారులు, అనధికారులు, నాయకులు, గ్రామస్తులు, పెద్ద శంకరం పేట, అల్లదుర్గం, రేగోడ్ మండలాలకు చెందిన డీ డి ఎన్ అర్చకులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు జాతరను తలపించాయి. ఆలయ అభివృద్ధి కి ప్రత్యేక నిధులు కేటాయించి భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాలని తద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్ర శేఖర్ ఒక ప్రకటన లో ప్రభుత్వానికి విన్నవించారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు, మండల అధికారులు, కళాకారులు, ఆలయ ప్రధాన అర్చకులు వైద్య. అరుణ్ శర్మ, గుడి. సంతోష్ కుమార్, లంకా రాజశేఖర్, ప్రముఖ వేద పండితులు గుడి శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఘన విజయం చేసిన ప్రతి ఒక్కరికి మెదక్ జిల్లా డీ డి ఎన్ అధ్యక్షులు శలాక. రాజేశ్వర్ శర్మ ప్రత్యేక ధన్యవాదములు తెలియ జేశారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు ఆదర్శనీయం





- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ సెప్టెంబర్,27(సిరి న్యూస్)**

తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమర యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను కలెక్టర్ క్యాంప్ కార్యాలయం లోఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పుష్పమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. సమాజంలోని అణగారిన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యలయంలో డిఆర్వో అంబాదాస్ రాజేశ్వర్ కొండ లక్ష్మణ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొండ లక్ష్మణ్ బాపు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. కొండ లక్ష్మణ్ బాపు సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారులు, కుల సంఘాల నాయకులు, క్యాంప్ ఆఫీస్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

# తెల్లాపూర్‌లో బీజేపీ కిసాన్ మోర్చా నూతన కమిటీ





- **రైతుల సమస్యలపై క్షేత్రస్థాయిలో పనిచేయాలి: గోదావరి అంజిరెడ్డి**
- **మన్ కీ బాత్ వీక్షణ.. నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు**

**రామచంద్రపురం, సెప్టెంబర్ 27 (సిరి న్యూస్):**

తెల్లాపూర్‌లో బీజేపీ సంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. కిసాన్ మోర్చా కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి రైతులకు అండగా నిలవాలని అన్నారు. త్వరలో జిల్లాలోని అన్ని మండలాలకు కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఉపాధ్యక్షులుగా మోహన్ రెడ్డి, రంజిత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, పుట్టి కాశీనాథ్, ప్రధాన కార్యదర్శులుగా వి. రాజి రెడ్డి, శివ నియమితులయ్యారు. వివిధ విభాగాల కన్వీనర్లు, కార్యవర్గ సభ్యులకు కూడా బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాణిక్ రెడ్డి, నరసింహ రెడ్డి, కృష్ణ యాదవ్, లక్ష్మారెడ్డి, రాజ్ రెడ్డి, శుభాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బి ఎస్ ఆర్ గణేష్ లడ్డు.. ప్రెసిడెంట్ సొంతం





- **రూ.1.90 లక్షల అమూల్యమైన ప్రసాదం సోమేశ్వర్ రావు వశం**

**అమీన్పూర్ సెప్టెంబర్ 27 సిరి న్యూస్**

అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని పటేల్ గూడా బిఎస్సార్ కాలనీలో తొమ్మిది రోజులపాటు లంబోదరుడికి కాలనీ ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా నిత్య పూజలు విశేష సేవలు నిర్వహించారు. భక్తుల సమక్షంలో కోలాహలం, నవరాత్రులు విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరం కాలనీవాసులంతా ఒకే చోటకు చేరి సమష్టిగా గణనాథుడి వీడ్కోలు వేడుకలను అత్యంత వేడుకగా నిర్వహించారు. తీవ్ర పోటీ నడుమ లడ్డు వేలం, నిమజ్జన ఊరేగింపులకు ముందు నిర్వహించిన స్వామివారి లడ్డు వేలంపాట ఉత్కంఠ భరితంగా సాగింది, కాలనీవాసులు భక్తులు వేలంలో పోటీపడ్డారు. రూ.1.90.000 కు లడ్డు కైవసం, తీవ్ర పోటీ మధ్య బి ఎస్ ఆర్ కాలనీ ప్రెసిడెంట్ సల్వాజి సోమేశ్వర్ రావు లంబోదరుని లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సల్వాజి సోమేశ్వర్ రావు మాట్లాడుతూ ... కన్నుల పండుగ శోభాయాత్ర లడ్డూ వేలం అనంతరం కాలనీ ప్రజల సమక్షంలో విగ్నేశ్వరుడి శోభాయాత్ర ఊరేగింపు మనోహరంగా సాగింది అని తెలిపారు. భక్తుల నృత్యాలు, జయజయద్వానాలు, డప్పు వాయిద్యాలు బాణాసంచా వెలుగులు యువత ఆటపాటలు మరియు జై గణేష్ గణపతి బప్పా మోరియా నినాదాలతో పటేల్ కూడా బిఎస్సార్ కాలనీ పురవీధులు మారుమోగాని తెలిపారు. భక్తిశ్రద్ధలతో నిమజ్జనం, కాలనీ ప్రజలంతా పాల్గొని మంగళహారతులు పట్టి వచ్చే ఏడాది త్వరగా రావాలని కోరుకుంటూ బజ్జ గణపయ్యను ఘనంగా నిమజ్జనం చేశారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్‌టీయూ 80 వసంతాల వైభవోత్సవ కార్యక్రమం

**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 27 (సిరి న్యూస్):**




రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) 80 వసంతాల వైభవోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని నాగోల్ శుభం కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఎస్‌టీయూ ఆవిర్భావం నుంచి ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కులు, విద్యా రంగ అభివృద్ధి కోసం సంఘం చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్ద శంకరం పేట మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు రాష్ట్ర నాయకులు బొడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఎస్‌టీయూ 80 ఏళ్ల ప్రస్థానం, ఉపాధ్యాయ ఉద్యమంలో సంఘం పోషించిన పాత్ర, భవిష్యత్ కార్యాచరణపై కార్యక్రమంలో చర్చలు జరిగాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, సంఘం నాయకులు, ప్రతినిధులు ఈ వైభవోత్సవంలో పాల్గొన్నారు. పెద్ద శంకరం పేట నుంచి హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో మామిడి కుమార్, ఎన్. ఆనంద్, రాధాకృష్ణ, అశోక్‌రెడ్డి, సిద్ధిరాములు, నారాయణ, సుధీర్, సాయిగౌడ్, వెంకట్ తదితర ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌టీయూ 80 వసంతాల వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేస్తామని తెలిపారు.

# విద్యుత్ షాక్ తో రైతు మృతి



**నర్సాపూర్ సెప్టెంబర్ 27 (సిరి న్యూస్)**

విద్యుత్ షాక్ తో రైతు మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలం నత్నాయిపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..నత్నాయిపల్లి గ్రామానికి చెందిన గొల్ల మల్లేశం(34) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన తమ్ముడు అనిల్ కుమార్, కౌలు రైతు అండూరి వీరేశంతో కలిసి ఆదివారం పొలానికి నీరు వేయడానికి వెళ్లారు. గొల్ల మల్లేశం బోరు మోటర్ వేయగా అది స్టార్ట్ కాకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్లి వైర్ చెక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడ పడిపోయాడు. గమనించిన మిగతా ఇద్దరు బైక్ పై నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపారు

# పరిడ విల్లిన మెదక్ సంస్కృతి వైభోగం





- 16 కళారూపాలతో ప్రపంచ పర్యాటక దినోత్సవ ర్యాలీ.
- ప్రపంచానికి అన్నం పెట్టింది మెతుకు సీమ.
- మెదక్ పర్యాటక కేంద్రాలను ప్రపంచానికి పరిచయం చేయాలి.
- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు.
- ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం.
- మెదక్ జిల్లాలో 4000 మందితో ర్యాలీ.
- మెదక్ ఖిల్లా సందర్శనార్థం టికెట్ కౌంటర్ ప్రారంభం.

**మెదక్ సెప్టెంబర్,27(సిరి న్యూస్)**

ప్రపంచానికి అన్నం పెట్టిన మెతుకు సీమ పర్యాటక ప్రాంతంగా వీరాజిల్లుతుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు.ఆదివారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లాలో 4,000 మందితోర్యాలీ నిర్వహించి మెదక్ ఖిల్లాపై కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,మెదక్ మున్సిపల్ చైర్పర్సన్ రాధిక భూపతి రాజు లు కలిసి జెండా ఊపి ప్రారంభించారు.ఈ ర్యాలీలో డప్పు, డోలు, తంబుర, చిందు, భాగవత,బోనాలు,బతుకమ్మ,లంబడి,గీతా కార్మికులు ,కరాటే,ఎన్సిసి విద్యార్థులు ,ఒగ్గు తదితర తదితర కళాకారులు వారి వేషధారణలో పాల్గొన్నారు. అనంతరం వెస్లీ కళాశాలలో పర్యాటక రంగ ఏవీనీ వీక్షించారు.శాంతి సందేశానికి సూచికగా ఎంపీ,కలెక్టర్,అదనపు ఎస్పీ , మున్సిపల్ చైర్పర్సన్ తెల్లటి పావురాలను ఎగురవేసి, మెదక్ పర్యాటక రంగా అధికారిక వెబ్ సైట్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ. ప్రపంచానికి అన్నం పెట్టిన చరిత్ర మెతుకు సీమ మెదక్ అన్నారు. రాష్ట్రస్థాయిలో పర్యాటక రంగంలో మొదటి బహుమతి పొందిన కలెక్టర్ ప్రతిమా సింగ్ ను అభినందించారు. మోదీ నాయకత్వంలో భారతదేశంలో పర్యాటక రంగం చాలా అభివృద్ధి సాధించిందని ప్రపంచంలో ఉన్న 175 దేశాలు భారతదేశానికి పర్యాటక సంస్థలను సందర్శిస్తున్నారని అన్నారు. భారత్ టూరిజం లో చాలా ముందుకెళ్తుందని తెలిపారు. శని, ఆదివారాల్లో పర్యాటక ప్రేమికుల దృశ్య ట్రాఫిక్ నియంత్రించాలని సూచించారు. మెదక్ జిల్లా ప్రకృతి కాపాడాలన్నారు. ప్రకృతి , టూరిస్ట్ ప్రదేశాల్లో ప్లాస్టిక్ నిషేధించాలని సూచించారు. ప్లాస్టిక్ బదులుగా స్టీల్ వస్తువులను ఉపయోగించాలన్నారు. జిల్లా యంత్రాంగం పర్యాటక అభివృద్ధి కోసం జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో మెదక్ జిల్లా వెనకబడిందన్నారు.కలెక్టర్ ప్రతిమా సింగ్ వచ్చిన తర్వాత మెదక్ అభివృద్ధికి కొత్త ఊపొచ్చిందని ప్రశంసించారు.ఆదిలాబాద్, ములుగు జిల్లాలకు పోటీగా మెదక్ టూరిజం అభివృద్ధి చెందుతోందని తెలిపారు.పోచారం అభయారణ్యం, నర్సాపూర్ అర్బన్ పార్క్, ఏడుపాయల వనదుర్గ, మెదక్ చర్చి తదితర ప్రాంతాల మరింత అభివృద్ధి చేయాలన్నారు.మెదక్ జిల్లాను ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ కృషి చేస్తుందన్నారు. నర్సాపూర్ అడవుల అందాలను సినీ పరిశ్రమ కూడా గుర్తించిందన్నారు. పర్యాటక అభివృద్ధితో హోటళ్లు, టూరిస్ట్ గైడ్లు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్రపంచ చిత్రపటంలో టూరిజం ర్యాంకింగ్ విషయంలో భారతదేశం 69వ స్థానంలో ఉండేదని, నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక టూరిజం విషయంలో 69 నుంచి 39 వ స్థానానికి ఎదిగిందన్నారు. ప్రపంచ పర్యాటక పటంలో భారత్ స్థానం మెరుగుపడుతోందనీ వివరించారు.మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్థానిక భాష నేర్చుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో చాలా చారిత్రక వారసత్వ , సాంస్కృతిక సంపద, కలిగి ఉందని , దానిని భావితరాల కు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు. పర్యాటక సర్క్యూట్ గా చేసేందుకు 14 ప్రదేశాలను గుర్తించామన్నారు. మెదక్ జిల్లా పర్యాటక ప్రదేశాలను ప్రపంచ స్థాయి గుర్తింపు తేవడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, జెడ్పి సీఈవో, జిల్లా టూరిజం అధికారి ఎల్లయ్య, మెదక్ ఆర్డీవో రమాదేవి , డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, స్పోర్ట్స్ ఆఫీసర్ రమేష్, మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్, మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్ బాబు,స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు,వివిధ శాఖల జిల్లా అధికారులు, కళాకారుడు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# రాగం సుజాత యాదవ్ సేవలు చిరస్మరణీయం



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 27 (సిరి న్యూస్):**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు మాజీ చైర్పర్సన్ దివంగత రాగం సుజాత యాదవ్ జ్ఞాపకార్థం నల్లగండ్లలోని వర్టెక్స్ కింగ్‌స్టన్ పార్క్ విల్లాస్ క్లబ్‌హౌస్‌లో పెద్దలకు బియ్యం సమర్పణ, దేవాలయంలో గంట కట్టే కార్యక్రమాలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, వ్యాపారవేత్తలు, పుర ప్రముఖులు, అభిమానులు, వేలాది మంది ప్రజలు నివాళులర్పించారు. ప్రజా జీవితంలో రాగం సుజాత యాదవ్ అందించిన సేవలను పలువురు స్మరించుకున్నారు. కౌన్సిలర్‌గా, సాంఘిక సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆమె మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు వంటి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు.ఈ సందర్భంగా రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ, తన ప్రజా జీవితంలో మూడు దశాబ్దాలకు పైగా సుజాత యాదవ్ తనకు అండగా నిలిచారని, ఆమెను కోల్పోవడం కుటుంబానికే కాకుండా తనకు వ్యక్తిగతంగా తీరని లోటని భావోద్వేగానికి గురయ్యారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా ఇకపై తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేస్తానని తెలిపారు. దివంగత సుజాత యాదవ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సంప్రదాయబద్ధంగా పెద్దలకు బియ్యం సమర్పణ, దేవాలయంలో గంట కట్టే కార్యక్రమాలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి హాజరై నివాళులర్పించిన ప్రతి ఒక్కరికీ రాగం నాగేందర్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హాజరైన వారికి అన్నసంతర్పణ నిర్వహించారు.

# శిల్పారామంలో నృత్య వైభవం



- విభిన్న రాష్ట్రాల శాస్త్రీయ నృత్యాలతో అలరించిన కళాకారులు

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 27 (సిరి న్యూస్):**

శిల్పారామం వేదికగా 'నేషనల్ డాన్స్ ఫెస్టివల్-2026' కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. త్రిధారా, ఆకృతి కథక్ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నేషనల్ ప్రెజెన్స్ స్కీమ్ సహకారంతో నిర్వహించిన ఈ వేడుకలను శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ రిటైర్డ్ ఐఏఎస్ జి.కిషన్‌రావు, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పండిట్ రాఘవ్‌రాజ్ భట్, త్రిధారా డైరెక్టర్ గురు డాక్టర్ గజేంద్రకుమార్ పాండా ప్రారంభించారు. ఉత్సవంలో కథక్, ఒడిస్సీ, మోహినియాట్టం, గోతిపువా, బిహు తదితర భారతీయ నృత్యరీతుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆకృతి కథక్ కేంద్రం, త్రిధారా బృందాలతో పాటు పలువురు ప్రముఖ కళాకారులు, నృత్య సంస్థలు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. 'గుడికి నాట'తో పాటు వివిధ శాస్త్రీయ, జానపద నృత్యరూపాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పాయి. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న కళాకారులను పండిట్ రాఘవ్‌రాజ్ భట్, డాక్టర్ గజేంద్రకుమార్ పాండా ఘనంగా సత్కరించారు.

# చరిత్రకు ఊపిరిపోద్దాం.. కట్టడాలను సంరక్షిద్దాం!





- కాకతీయ శిలాతోరణం వద్ద పర్యాటక దినోత్సవం

**వెల్దుర్తి,సెప్టెంబర్27, (సిరి న్యూస్):**

చారిత్రక కట్టడాలు మన సంస్కృతి, వారసత్వానికి ప్రతీకలని, వాటిని కాపాడుకోవడం కేవలం అధికారుల బాధ్యతే కాదని, ప్రజలందరూ భాగస్వాములై సంరక్షించాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ విగ్నేష్, సర్పంచ్ దండం ఆదర్శ్,పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన వెల్దుర్తి లో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని చరిత్రకు నిలయంగా ఉన్న 11వ శతాబ్దం నాటి కాకతీయుల శిలాతోరణం, అలాగే పద్మనాభస్వామి ఆలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి చారిత్రక కట్టడం, పాలనా వైభవాన్ని గుర్తుచేసుకున్నారు. కాకతీయుల పాలనకు, ఆనాటి చారిత్రక ఘట్టాలకు సాక్ష్యాలుగా నిలిచిన కట్టడాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. కాలక్రమంలో చారిత్రక ఆనవాళ్లు శిథిలావస్థకు చేరకుండా వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వెల్దుర్తి ప్రాంతంలో ఉన్న చారిత్రక ప్రదేశాలకు విస్తృత ప్రచారం కల్పించి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తే స్థానిక ప్రాంతానికి మరింత గుర్తింపు లభిస్తుందన్నారు. యువత చారిత్రక వారసత్వంపై అవగాహన పెంచుకుని, కట్టడాల సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్, మండల రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, ఆర్ ఐ నర్సింగ్ యాదవ్, ఏపీఎం సుభాష్, పంచాయతీ సెక్రెటరీ కృష్ణ వార్డు సభ్యులు, ఆయా గ్రామాల సెక్రటరీలు, వెలుగు సమాఖ్య సిసి లు మహిళలు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- సదాశివపేటలో ఘనంగా జయంతి వేడుకలు.. కూచిపూడి కళాక్షేత్రం ప్రారంభించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సదాశివపేట: సెప్టెంబర్ 27 (సిరి న్యూస్)**

తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సదాశివపేట పట్టణంలో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద ఉన్న కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం కోసం కొండ లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన చూపిన సామాజిక స్పృహ, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. బాపూజీ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సదాశివపేట బసవేశ్వర టెంపుల్‌లో ఏర్పాటు చేసిన కూచిపూడి కళాక్షేత్రాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలు మన సమాజానికి గొప్ప వారసత్వమని ఎమ్మెల్యే అన్నారు. వాటిని పరిరక్షించడంతో పాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువతలో కళల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి కళాక్షేత్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కూచిపూడి వంటి శాస్త్రీయ కళలకు సదాశివపేటలో మరింత ఆదరణ లభించేలా ఈ కళాక్షేత్రం మంచి వేదికగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. చిన్నారులు, యువత కళలను నేర్చుకుని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.






# పర్యాటక ప్రాంతాలతో స్థానిక అభివృద్ధి



**నర్సాపూర్ సెప్టెంబర్ 27 (సిరి న్యూస్)**

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆదివారం నర్సాపూర్ ఫారెస్ట్ అర్బన్ పార్క్ లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించుకోవడం నర్సాపూర్ అర్బన్ పార్క్ తో వివిధ ప్రాంతాల నుండి పర్యటకులు రావడం పచ్చని వాతావరణం ఇక్కడ ఉండడం అడవులను వీక్షించడం అడవులకు రక్షణ కల్పించి పర్యావరణానికి హాని చేయకుండ చెట్లను పెంచడం పర్యావరణ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని అన్నారు పర్యటక కేంద్రాల ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి, ఆర్థిక అభివృద్ధి చేకూరుతుందని చారిత్రాత్మక కట్టడాలు, ప్రకృతి, అటవీ సంపద తదితర వాటిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఎఫ్ఎర్వో దివ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఏపీవో అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం



- ఆల్విన్‌కాలనీలో ఘనంగా 111వ జయంతి వేడుకలు

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 27 (సిరి న్యూస్):**

తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమర యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని పురస్కరించుకుని ఆల్విన్‌కాలనీ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మబండలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం, నిజాం వ్యతిరేక పోరాటం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో మంత్రి పదవిని సైతం వదులుకుని ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ఆయన త్యాగం చిరస్మరణీయమన్నారు. తెలంగాణ సాధన కోసం తన సొంత ఇంటిని సైతం ఉద్యమ కార్యకలాపాలకు అంకితం చేసిన బాపూజీ ప్రజాసేవా నిబద్ధత, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. భావి తరాలు ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# టిప్పర్ పట్టివేత..

- అనుమతులు లేకుండా ఇసుక తరలింపు..

**హత్నూర, సెప్టెంబర్ 27 (సిరి న్యూస్):**

హత్నూర పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పెట్రోలింగ్‌లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో దౌల్తాబాద్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో టి ఎస్ 08 యు జె 2466 నంబర్ గల అశోక్ లేలాండ్ టిప్పర్‌ను ఆపి తనిఖీ చేయగా, అందులో ఇసుక ఉన్నట్లు గుర్తించారు. ఇసుక తరలింపునకు సంబంధించిన ప్రభుత్వ అనుమతులు, రవాణా పత్రాలను పోలీసులు పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేనట్లు గుర్తించారు. వాహన డ్రైవర్‌ను విచారించగా షేక్ చాంద్ పాషా (39)గా గుర్తించారు. తన యజమాని ఆదేశాల మేరకు ఇస్మాయిల్‌ఖాన్‌పేట్




నక్కవాగు నుంచి ఇసుకను గుమ్మడిదలకు తరలిస్తున్నట్లు డ్రైవర్ పోలీసులకు తెలిపినట్లు సమాచారం. దీంతో పోలీసులు టిప్పర్‌ను హత్నూర పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# బాపూజీ ఆశయాల సాధనకు కృషి చేయాలి



**సదాశివపేట. సెప్టెంబర్ 27. (సిరిన్యూస్)**

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు మునిపల్లి విశ్వనాథం పిలుపునిచ్చారు. బాపూజీ 111వ జయంతిని పురస్కరించుకుని సదాశివపేట పట్టణంలోని స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా 18వ వార్డు కౌన్సిలర్ బిట్ల నిఖిత ప్రేమ్ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిట్ల నిఖిత ప్రేమ్ మాట్లాడుతూ పద్మశాలి ముద్దుబిడ్డగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమ తొలి దశలో కీలకంగా పనిచేసిన నాయకుల్లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ముందువరుసలో ఉన్నారని గుర్తుచేశారు. ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. బాపూజీ అడుగుజాడల్లో యువత ముందుకు సాగుతూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, కౌన్సిలర్లు అరుణ్, షాజీ,నర్సిములు, నాయకులు వైద్యం పవన్, తుల్జారాం, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, పద్మశాలి సేవా సంఘం నాయకులు, సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# సేవా భావంతో పనిచేస్తేనే ఉపాధ్యాయులకు గుర్తింపు..





- ప్రగతి ధర్మారంలో ఉపాధ్యాయుడు విట్టాల రాజేశ్వర శర్మ పదవి విరమణ.
- ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడిన రాష్ట్ర మహిళా శిశు సాధికారిక సంస్థ చైర్పర్సన్ బంద్రు శోభారాణి

**రామాయంపేట, సెప్టెంబర్ 26 (సిరి న్యూస్)**

ఉపాధ్యాయులు సేవా భావంతో పనిచేస్తేనే వారికి నిజమైన గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర మహిళా శిశు సాధికారిక సంస్థ చైర్పర్సన్ బంద్రు శోభారాణి అన్నారు. ఆదివారం నాడు రామాయంపేట మండలంలోని ప్రగతి ధర్మారంలో ఉన్న జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న విట్టాల రాజేశ్వర్ శర్మ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది ప్రగతి ధర్మారం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో ఉపాధ్యాయుడిగా సేవలందించి పదవీ విరమణ పొందిన విట్టాల రాజేశ్వర్ శర్మ వీడ్కోలు మరియు సన్మాన కార్యక్రమం అత్యంత ఘనంగా, భావోద్వేగభరిత వాతావరణంలో జరిగింది. విద్యారంగానికి ఆయన అందించిన సేవలను కొనియాడుతూ పలువురు ప్రముఖులు, గ్రామస్థులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ అపూర్వ వేడుకకు రాష్ట్ర మహిళా, శిశు సాధికారిక సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అలాగే ఈ కార్యక్రమంలో ప్రముఖ పండితులు విట్టాల మధుసూదన్ పంతులు, శాస్త్రుల రఘురామ శర్మ, తీగుళ్ల నరసింహమూర్తి శర్మ, ఆర్టీఏ ఆర్.బాబు,రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా, వేలేటి రామ్మోహన్ శర్మ, పదవి విరమణ చేసిన రాజేశ్వర్ శర్మ కుటుంబ సభ్యులు ,విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తికి రాజేశ్వర్ శర్మ వన్నె తెచ్చారని, ఎంతోమంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర మరువలేనిదని ప్రశంసించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయడానికి ఎంతగానో కృషి చేశారని రాజేశ్వర శర్మ కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎం. సిద్ధిరాంరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ లలిత రమేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మాసాయిపేట మల్లేశం, ఉడత రాజేశం, షాదుల్లా, చాకలి చిన్న నారాయణ, పెండెల వెంకటేశం, వడ్ల శ్రీశైలం, యువ నాయకులు దొమ్మాట రవీందర్, నాగరాజు, కే. మల్లేశం, ఎస్.జి. భాష తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ఇదే పాఠశాలలో చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్న ఎంతోమంది పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ గురువుకు పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ వేడుక ధర్మారం గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపించింది.



# లక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్ ఎన్నికల హామీ నెరవేర్పు

- ఎస్సీ మాల కమ్యూనిటీ
- హాల్ కు రూ.10 లక్షల నిధులు మంజూరు.
- పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు.
- లక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్, మండల బిజెపి అధ్యక్షుడు గొల్లపల్లి నవీన్ గౌడ్

**రామాయంపేట, సెప్టెంబర్ 27**

(సిరి న్యూస్) రామాయంపేట మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్ గొల్లపల్లి నవీన్ గౌడ్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు, గ్రామంలోని ఎస్సీ మాల కమ్యూనిటీ హాల్ నిర్మాణం / అభివృద్ధి కోసం రూ. 10 లక్షల నిధులు మంజూరు చేయించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం, సర్పంచ్ నవీన్



గౌడ్ చొరవ తీసుకుని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి ఈ నిధులను మంజూరు చేశారని సర్పంచ్ నవీన్ గౌడ్ తెలిపారు. ఈ నిధులతో త్వరలోనే కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభించబడతాయనీ,



ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు కు సహకరించిన నాయకులకు, గ్రామ పెద్దలకు మరియు గ్రామ ప్రజలకు సర్పంచ్గొల్లపల్లి నవీన్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్స్ మల్లేష్, సాయి గ్రామ పెద్దలు దుబ్బాగౌడ్ చేపూరి రామస్వామి యాదగౌడ్ రావుల మోహన్ బిజెపి నాయకులు బండి జగన్ రంజిత్ గౌడ్ భూత్ అధ్యక్షులు బాలరాజ్ రావుల సిద్ధ రాములు భాను ప్రకాష్ నాగరాజు మైపాల్ చేపూరి స్వామి నంద్ర బోయిన శివ రాజు మరియు కుల సభ్యులు పాల్గొన్నారు

# ఉషాకిరణ్ యూత్ వినాయకపత్రి నిమజ్జనం

**సదాశివపేట. సెప్టెంబర్ 27. (సిరిన్యూస్)**

సదాశివపేట పట్టణంలోని పాతకేరి ప్రాంతానికి చెందిన ఉషాకిరణ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పత్రి, పూలతో పూజించిన అనంతరం సదాశివపేటలోని గుడిపల్లి శ్రీరామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలోని గంగానదిలో గణనాథుడిని నిమజ్జనం చేశారు. అనంతరం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్ట్ అభ్యర్థి పులిమామిడి రాజు మరియు 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఉషాకిరణ్ యూత్ సభ్యులు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ 11 రోజుల పాటు వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన ఉషాకిరణ్ యూత్ సభ్యులను అభినందించారు. ప్రతి సంవత్సరం ఇదే స్ఫూర్తితో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బామిని రవి, చీలం సురేష్, బుసరెడ్డి పల్లి వెంకటేశం, నర్సింలు, మాలె శ్రీను, సోమ శంకర్‌తో పాటు ఉషాకిరణ్ యూత్ సభ్యులు, 12 వ వార్డు మహిళలు, పిన్నలు, పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్.

**సదాశివపేట. సెప్టెంబర్ 27. (సిరిన్యూస్)**

తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. ఆదివారం నాడు సదాశివపేట చేనేత సహకార సంఘం, పట్టణ పద్మశాలి సేవా సమాజం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను సంఘమ అధ్యక్షులు చింత గోపాల్ పద్మశాలి సేవా సమాజంఅధ్యక్షులు మేకల జనార్ధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరయ్యారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటం ముందు జ్యోతి వెలిగించి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండలక్ష్మణ్ బాపూజీ క్విట్ ఇండియా, ముల్కీ.తెలంగాణఉద్యమంలో కీలకపాత్ర పోషించిన, జాతి గర్వించదగ్గ ఉద్యమకారుడు,సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతి అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడని, ఆయన సేవలు మరువరానివి మరువలేనివి అని కొనియాడారు. అనంతరం విగ్రహ దాతలకు ఎమ్మెల్యే చేతుల మీదగా శాలువాతో సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో చేనేత సహకార సంఘం పెద్దలు అంబటి విశ్వనాథం. చిక్కుల మల్లేశం. గోనె శంకర్. మధునాల నరసింహులు. చింత సాయినాథ్. చిక్కుర్తి అంబయ్య.



చిల్వర్ వెంకటేశం. రమేష్. చింతానంద్. కౌన్సిలర్ పని కృష్ణ. విజయ్ కుమార్. డబ్బా నాని.సిల్వర్ రవి. ఆటిపాముల కృష్ణ. కోట రవీందర్. అడ్డగడ్ల మనోహర్. లింగం. వెంకటేశం. తదితర పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.



# 'ది వాన్'తోనూ తమన్నాకు నిరాశేనా?

హైదరాబాద్, సెప్టెంబరు 26 (సమయం న్యూస్): ముంబయి నుంచి వచ్చి టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన తమన్నా భాటియా.. దక్షిణాదిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'మిల్కీ బ్యూటీ'గా అభిమానుల మన్ననలు అందుకున్న ఆమె.. స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలతో అగ్ర కథానాయికగా కొనసాగారు. అయితే బాలీవుడ్‌లో మాత్రం హీరోయిన్‌గా ఆశించిన స్థాయిలో విజయాలు దక్కడం లేదనే చర్చ తరచూ వినిపిస్తోంది. సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటించిన 'ది వాన్'లో తమన్నా కథానాయికగా కనిపించారు. అడవిలోని తమ కుటుంబ భూమికి సంబంధించిన వివాదం నేపథ్యంలో సొంతూరికి వెళ్లే నాస్తికుడైన వ్యక్తి ఎదుర్కొనే పరిస్థితుల చుట్టూ కథ సాగుతుంది. ఇందులో హీరో భార్యగా తమన్నా నటించారు. అయితే కథ మొత్తం హీరో చుట్టూనే తిరగడంతో ఆమె పాత్రకు పెద్దగా ప్రాధాన్యం లేదనే అభిప్రాయాలు కొందరు విమర్శకుల నుంచి వ్యక్తమవుతున్నాయి. 'ది వాన్'లో తమన్నా కనిపించే పాటకు మాత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలుస్తోంది. అయితే కథానాయికగా ఆమె నటనపై పెద్దగా చర్చ జరగడం లేదనే కామెంట్లు వినిపిస్తున్నాయి. దీంతో ఈ సినిమా కూడా తమన్నా బాలీవుడ్ కెరీర్‌లో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయిందనే చర్చ మొదలైంది. బాలీవుడ్‌లో ప్రత్యేక పాటల విషయంలో మాత్రం తమన్నాకు మంచి ఆదరణ లభించింది. 'స్త్రీ 2', 'రైడ్ 2' వంటి చిత్రాల్లో ఆమె చేసిన ప్రత్యేక పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మరోవైపు 'లస్ట్ స్టోరీస్ 2', 'ప్లాన్ ఎ ప్లాన్ బి', 'బబ్లీ బౌన్సర్' వంటి చిత్రాల్లో కథానాయికగా కనిపించినా.. అవి ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాయి. ఇప్పుడు 'ది వాన్'పై వస్తున్న స్పందన నేపథ్యంలో బాలీవుడ్‌లో తమన్నా తదుపరి ప్రాజెక్టులపై ఆసక్తి నెలకొంది.



# ప్రమాదం తర్వాత ఆరో రోజే 'మండాడి' షూటింగ్‌కు మహిమా

హైదరాబాద్, సెప్టెంబరు 26 (సమయం న్యూస్): తమిళంలో ప్రస్తుతం 'మండాడి' సినిమా పేరు మార్మోగుతోంది. సూరి హీరోగా నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. తెలుగు నటుడు సుహాస్, సీనియర్ నటుడు సత్యరాజ్ కీలక పాత్రల్లో కనిపించగా.. మహిమా నంబియార్ తన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. సెప్టెంబరు 10న విడుదలైన ఈ చిత్రం కొద్ది రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరింది. 'మండాడి' విజయంలో మహిమా నంబియార్ చూపించిన అంకితభావం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సినిమాలోని 'ఉసురే నీదాన్ పుల్లా' పాట చిత్రీకరణకు ముందు ఆమె తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురయ్యారని దర్శకుడు మతిమారన్ సక్సెస్ మీట్‌లో వెల్లడించారు. ఈ ప్రమాదంలో మహిమా ముఖానికి తీవ్ర గాయాలు కాగా.. 20కి పైగా కుట్లు పడినట్లు ఆయన తెలిపారు. ప్రమాదం తర్వాత మహిమా పరిస్థితిని చూసి తాను కూడా షాక్‌కు గురయ్యానని దర్శకుడు చెప్పుకొచ్చారు. అలాంటి సమయంలో ఆమెను షూటింగ్‌కు రావాలని అడగడం కూడా తనకు ఇబ్బందిగా అనిపించిందన్నారు. అయితే సినిమాలో కీలకమైన పాట చిత్రీకరణ జరగాల్సి ఉండటంతో మహిమా ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ జరిగిన కేవలం ఆరో రోజుకే ఆమె తిరిగి సెట్స్‌లో అడుగుపెట్టారని మతిమారన్ వెల్లడించారు. 'మండాడి'లోని పాత్ర కోసం మహిమా శారీరకంగానే కాకుండా మానసికంగానూ ఎంతో కష్టపడ్డారని దర్శకుడు ప్రశంసించారు. సినిమాలోని కొన్ని భావోద్వేగ సన్నివేశాలు తనను వ్యక్తిగతంగా కూడా ప్రభావితం చేశాయని మహిమా గతంలో చెప్పినట్లు తెలుస్తోంది. కథ, నటీనటుల ప్రదర్శన, దర్శకుడి తెరకెక్కించిన విధానంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.111.80 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాల లెక్కలు చెబుతున్నాయి.

# 'కల్కి 2' షూటింగ్‌కు రంగం సిద్ధం

హైదరాబాద్, సెప్టెంబరు 26 (సమయం న్యూస్): పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్', 'ఫౌజీ' చిత్రాలతో బిజీగా ఉన్నప్పటికీ.. 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ 'కల్కి 2'పై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వచ్చే నెల నుంచి ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ వేగం పుంజుకోనున్నట్లు సమాచారం. కొత్త షెడ్యూల్‌లో ప్రభాస్‌తో పాటు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె తదితర కీలక నటీనటులు పాల్గొననున్నట్లు తెలుస్తోంది. తొలి భాగం ముగింపులో ఇచ్చిన భారీ హైప్‌కు కొనసాగింపుగా రెండో భాగంలో కథ మరింత ఆసక్తికరంగా ఉండబోతుందని అభిమానులు భావిస్తున్నారు. 2024లో విడుదలైన 'కల్కి 2898 ఏడీ' ప్రపంచవ్యాప్తంగా భారీ విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు నాగ్ అశ్విన్ రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో తెరకెక్కించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. అధునాతన దృశ్య ప్రభావాలు, భారీ నిర్మాణ విలువలతో రూపొందనున్న ఈ చిత్ర షూటింగ్‌ను 2027 ప్రథమార్ధంలో పూర్తి చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. తొలి భాగంలో మిగిలిపోయిన ప్రశ్నలకు సమాధానాలతో పాటు మహాభారత కాలానికి సంబంధించిన కీలక ఘట్టాలు, కలియుగం నేపథ్యంలో జరిగే పరిణామాలను 'కల్కి 2'లో మరింత గ్రాండ్‌గా చూపించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ ఈ సీక్వెల్‌పై భారీ ఆసక్తి నెలకొంది.




# 31 ఏళ్లకే విషాదాంతం.. ఆర్తి అగర్వాల్ జీవితం



హైదరాబాద్, సెప్టెంబరు 26 (సమయం న్యూస్): తెలుగు సినీ పరిశ్రమలో అనతికాలంలోనే అగ్ర కథానాయికగా ఎదిగిన అందాల తార ఆర్తి అగర్వాల్. స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు అందుకుంటూ ఓ వెలుగు వెలిగిన ఆమె జీవితం.. ఆ తర్వాత వ్యక్తిగత సమస్యలు, సినిమాలకు దూరం కావడం, అనారోగ్య పరిస్థితులతో విషాదంగా ముగిసింది. ఆర్తి అగర్వాల్ 14 ఏళ్ల వయసులోనే మోడలింగ్‌లోకి అడుగుపెట్టారు. ముంబయిలో నటనలో శిక్షణ తీసుకున్న ఆమె 2001లో 'పాగల్‌పన్' అనే హిందీ చిత్రంతో సినీరంగ ప్రవేశం చేశారు. అదే ఏడాది వెంకటేశ్ హీరోగా కె. విజయభాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'నువ్వు నాకు నచ్చావ్'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో ఆర్తి అగర్వాల్ ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారారు. ఆ తర్వాత 'నువ్వు లేక నేను లేను', 'అల్లరి రాముడు', 'ఇంద్ర' వంటి చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఉదయ్ కిరణ్, మహేశ్‌బాబు, బాలకృష్ణ, రవితేజ, నాగార్జున, ప్రభాస్ తదితర అగ్ర హీరోల సరసన వరుస అవకాశాలు అందుకున్నారు. అయితే కెరీర్ పీక్‌లో ఉన్న సమయంలో వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు వార్తలు, పుకార్లు ఆమెను ఇబ్బందులకు గురిచేశాయని అప్పట్లో కథనాలు వెలువడ్డాయి. అనంతరం కొంతకాలం సినిమాలకు దూరమయ్యారు. 2007లో ఎన్నారై ఉజ్వల్ నికమ్‌ను వివాహం చేసుకున్న ఆర్తి.. కొంతకాలానికే వైవాహిక జీవితంలో సమస్యలు ఎదుర్కొన్నారని వార్తలు వచ్చాయి. అనంతరం విడాకులు తీసుకుని మళ్లీ సినిమాల్లోకి వచ్చారు. 'అందాల రాముడు', 'గోరింటాకు', 'జెంటిల్‌మెన్' వంటి చిత్రాల్లో నటించారు. అయితే అప్పటికే అవకాశాలు తగ్గడంతో పాటు ఆమె బరువు పెరగడం కూడా కెరీర్‌పై ప్రభావం చూపింది. తిరిగి హీరోయిన్‌గా అవకాశాలు అందుకోవాలనే ప్రయత్నంలో భాగంగా బరువు తగ్గేందుకు ఆర్తి అగర్వాల్ 2015 జూన్ 4న అమెరికాలోని న్యూజెర్సీలో లైపోసక్షన్ చేయించుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఇంటికి వెళ్లిన ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుకు గురయ్యారు. 31 ఏళ్ల వయసులోనే ఆమె కన్నుమూయడం తెలుగు సినీ పరిశ్రమను, అభిమానులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన ఆర్తి అగర్వాల్ జీవితం ఇప్పటికీ అభిమానుల మనసుల్లో చెరగని జ్ఞాపకంగా నిలిచిపోయింది.

# కాఫీ మరీ ఎక్కువగా తాగేయకండి..

రోజూ కాఫీ తాగితే గుండెజబ్బులు రావని.. క్యాన్సర్కు కూడా దూరం అవ్వొచ్చని అప్పుడప్పుడు మనకు కొన్ని పరిశోధనలు బయటకు వస్తుంటాయి. అయితే కాఫీ మరీ ఎక్కువగా తాగినా ప్రమాదమేనని తాజాగా నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాఫీలో ఉండే కెఫిన్ శరీరానికి చాలా ప్రమాదమని పరిశోధకులు చెబుతున్నారు. చాలా మంది కాఫీతాగనిదే డే స్టార్ట్ అవదు. కానీ కాఫీలో ఉండే కెఫిన్ చాలా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోజుకు 1 గ్రాము కంటే ఎక్కు కెఫిన్ ను తీసుకుంటే మెదడు తింటుందని చెబుతున్నారు. ఓ పరిశోధన ప్రకారం పార్కిన్సన్స్ వ్యాధి బారిన పడిన వారిలో 8 శాతం మంది కెఫిన్ వల్ల ఆ వ్యాధికి గురైనట్లు బయటపడింది. కెఫిన్ ఎక్కువగా తీసుకుంటే చేతులు వణకడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని చెబుతున్నారు.



### తరుచూ యూరిన్ వస్తుంది..

కెఫిన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఎక్కగా మూత్రం వెళ్లే అవకాశం ఉంది. దీంతో డీహైడ్రేట్ అయి తలనొప్పటికి దారితీస్తుందంటున్నారు. కెఫిన్ తగ్గిస్తే తలనొప్పి సమస్య తగ్గే అవకాశం ఉందని పరిశోధనలు నిరూపిస్తున్నాయ్. నిద్రలేమి సమస్యకు కూడా కెఫిన్ కారణమని తెలుస్తోంది.

### బీపీ వచ్చే చాన్స్

కెఫిన్ ఎక్కువగా తీసుకుంటే రక్తపోటు కూడా ఎక్కువయ్యే అవకాశముంది. కెఫిన్తో అడ్రినలిన్ ఎక్కువగా విడుదలై బ్లడ్ ప్రెజర్ను పెరుగుతుంది. రోజు రెండు నుంచి మూడు, నాలుగు కప్పుల కాఫీ తాగే వారిలో బ్లడ్ ప్రెజర్ ఎక్కువగా ఉంటుంది.

### 10 కాఫీ కప్పుల్లో 1గ్రామ్ కెఫిన్

10 కాఫీ కప్పులు తాగితే 1 గ్రాము కెఫిన్ తీసుకున్నట్లు. అలా 1.2 గ్రాముల కంటే ఎక్కువ కెఫిన్ ను తీసుకుంటే తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. కాబట్టి మితంగా కాఫీ తాగితేనే ఆరోగ్యం.

# మాట తడబడుతోందా..

సత్తి చికాకు పెట్టే సమస్య. మాట్లాడటంలో చాలా ఇబ్బంది కలిగిస్తుంది. కొన్నిసార్లు ఒక్క అక్ష రమే బయటకు రావొచ్చు. మొత్తం పదం, వాక్యం పలకటం కష్టమవుతుంది. నత్తి పిల్లల్లో.. అదీ అబ్బాయిల్లో తరచూ చూస్తుంటాం. ముఖ్యంగా 2-5 ఏళ్ల వయసులో ఎక్కువ. పెద్దవారిలో సుమారు ఒక శాతం మందిలో, పిల్లల్లో దాదాపు 5 శాతం మందిలో కనిపిస్తుంటుంది. సాధారణంగా నత్తి గల పిల్లలు 70 నుంచి 90 శాతం మంది ఏడేళ్ల వయసుకు వచ్చేసరికి వాళ్లంతట వారే బయటపడుతుంటారు. పెద్దవారిలో హఠాత్తుగా నత్తి రావటం అరుదు. ఇంతకీ పిల్లలకు నత్తి ఎందుకొస్తుంది? నిజానికి వీళ్లు తెలివి గలవారు. కొన్నిసార్లు ఆలోచనల కన్నా మాట్లాడటానికి అవసరమైన కండర కదలికల సమన్వయ వేగం తక్కువగా ఉండొచ్చు. అంటే మాట్లాడే వేగం కన్నా ఆలోచనల వేగం పెరిగినప్పడు పదాలు, వాక్యాలు నత్తి నత్తిగా వస్తుంటాయి. దీంతో గాబరా, ఆదుర్దాకు లోనవుతారు. సమస్య తీవ్రమవుతూ వస్తుంటుంది. నత్తికి కొంతవరకు జన్యువులూ దోహదం చేయొచ్చు. కొన్ని కుటుంబాల్లో ఎక్కువ మందికి నత్తి ఉండటం చూస్తుంటాం. ఇది ఒత్తిడి, ఆందోళనకు గురైనప్పుడు మరింత ఎక్కువవుతుంది. కొందరికి అనుకరణతోనూ నత్తి అంటుకోవచ్చు.



### మాట్లాడుతూ ఉండాలి..

సత్తిని ఉన్నట్టుండి తగ్గించే మందేదీ లేదు. కానీ వీరికి స్పీచ్ థెరపీ బాగా ఉపయోగ పడుతుంది. ఈ చికిత్సతో పాటు ఇంట్లో పిల్లలకు మాట్లాడటంలో కొంత శిక్షణ ఇస్తే మరింత ప్రయోజనం కనిపిస్తుంది. నోటి నుంచి మాటలు వెలువడటానికి ముందే మెదడులో వాక్యాలు ఏర్పడతాయి. కాబట్టి నెమ్మదిగా మాట్లాడేలా అలవాటు చేయటం ముఖ్యం. రాగం తీస్తున్నట్టు మాట్లాడేలా చూడటమూ మంచిదే. సత్తి ఎక్కువగా ఉన్నవారు కూడా పాడేటప్పుడు తడబడరు. అందువల్ల పాటలు పాడటం, గాత్ర సంగీతం నేర్పించాలి. కొందరు నత్తిగా మాట్లాడుతున్నప్పుడు పిడికిలి బిగించటం, కళ్లు మిటకరించటం, కండరాలు బిగించటం వంటివీ చేస్తుంటారు. అందుకే ఆందోళనతో నత్తి వస్తుందని భావిస్తుంటారు. కానీ ఆందోళన తగ్గించే మందులతో ఎలాంటి ఉపయోగమూ ఉండదని బయటపడింది. సత్తికి తొలిదశలోనే చికిత్స చేయటం మంచిది, లేకపోతే ఆత్మ విశ్వాసం కొరవడే ప్రమాదముంది. నలుగురితో కలవలేక చదువులో వెనకబడొచ్చు, ఉద్యోగాల్లో పూర్తి స్థాయిలో రాణించకపోవచ్చు.




# టాటూల వల్ల వచ్చే ప్రమాదాలు ఇవే

వయసుతో సంబంధం లేకుండా ఇప్పుడు టాటూలు వేయించుకునే వారి సంఖ్య పెరిగిపోయింది. చర్మం కాస్త తేటగా ఉంటే చాలు... అక్కడ ఏదో ఒక టాటూ వేయించుకోవాలన్న కోరిక పెరిగిపోతోంది. ఎక్కువ మంది చేతులపై, భుజాలపై టాటూలను వేయించుకుంటున్నారు. న్యూయార్క్లోని బింగ్హామ్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు వల్ల ఆరోగ్యం పై ఎలాంటి ప్రభావం కనిపిస్తుందో తెలుసుకునేందుకు అధ్యయనం నిర్వహించారు. అమెరికాలోని చలామణిలో ఉన్న తొమ్మిది టాటూ ఇంక్ బ్రాండ్లను విశ్లేషించారు. వాటిలో 45 రకాల సమ్మేళనాలు ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉన్నట్టు తేలింది. ఆ 45 సమ్మేళనాల పేర్లను కూడా బహిర్గతం కానివ్వలేదు. ప్రజలు తమకు తెలియకుండానే టాటూలతో చర్మ సమస్యలను, ఆరోగ్య ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నట్టు అధ్యయనకర్తలు చెబుతున్నారు.

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ చెబుతున్న ప్రకారం టాటూ ఇంకులో పాలిథిన్ గ్లైకాల్ అనే రసాయనం ఉంటుంది. ఇది కొన్ని రకాల ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. అలాగే మరొక రసాయనం ఇందులో ఉంది. దాని పేరు 2-ఫినాక్సిథెనాల్ కొన్ని టాటూ ఇంకులలో ఈ ప్రమాదకరమైన పదార్థాన్ని గుర్తించారు. ఈ రసాయనం అధిక మోతాదులో చర్మంలోనికి ఇంకితే... చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, కాలేయ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే మూత్రపిండాలు, నరాలకు కూడా హాని కలుగుతుంది.

టాటూల్లోని రసాయనాలు దీర్ఘకాలంలో ఆరోగ్యం పై ప్రభావాన్ని చూపిస్తాయి. అవి చర్మం ద్వారా శరీరంలోకి ఇంకుతాయి. శరీరం నుంచి ఇతర అవయవాలకు కూడా చేరే అవకాశం ఉంది. కాబట్టి వీలైనంత వరకు టాటూలకు దూరంగా ఉండటమే మంచిది.

గతంలో కూడా టాటూలపై అనేక అధ్యయనాలు జరిగాయి. అందులో కూడా పరిశోధకులు ఇలాంటి అభిప్రాయాన్ని చెప్పారు. టాటూల వల్ల చర్మంలోని చెమట గ్రంథులకు నష్టం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. చెమట గ్రంథులు శరీరాన్ని చల్లబరచడం కోసం చెమటను ఉత్పత్తి చేసి బయటకి పంపిస్తాయి. దీనివల్ల మన శరీరంలో తగినంత ఉష్ణోగ్రత మాత్రమే ఉంటుంది. అయితే టాటూలు వేయించుకున్న చోట చెమట గ్రంథులు సరిగా పనిచేయవు. పచ్చబొట్టు ఉన్న ప్రాంతంలో ఒకలా, పచ్చబొట్టు లేని ప్రాంతంలో ఒకలా చెమట గ్రంథులు పనిచేస్తాయి.




The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

# చెత్తకుప్పల్లో దాగిన హెచ్చరిక!

- బోర్డు ఉన్నా చెత్త వేయాల్సిందే
- రూ.వెయ్యి జరిమానా అంటూ బోర్డు..
- అమలులో మాత్రం కనిపించని చర్యలు
- నిఘా ఏదీ?.. జరిమానాలు ఎన్ని?

అధికారుల తీరుపై ప్రజల్లో అసంతృప్తి

2





www.siridaily.com
RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్తపత్రిక

సోమవారం
సెప్టెంబర్-28-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 269

పేజీలు : 5




# నిబంధనలకు తిలోదకాలు.. కనిపించని సౌకర్యాలు!

## సదాశివపేట మండలం ఇసితాబాద్‌లో రియల్ మాఫియా లీలలు

- సర్వే నంబర్లు 58 నుంచి 66 వరకు 10 ఎకరాలకు పైగా అక్రమ దందా
- టీఎల్‌పీ కాగితాల ముసుగులో కనీస అభివృద్ధి పనులే చేయని వైనం
- రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ లేకుండానే యథేచ్ఛగా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు
- 10 శాతం గ్రామ పంచాయతీ ఓపెన్ స్పేస్‌నూ వాడేశారు..
- ఫైనల్ లేఅవుట్ అనుమతి రాకముందే వ్యాపారుల హడావుడి
- గ్రామ పంచాయతీ ఆదాయానికి లక్షల్లో గండి
- అధికారులతో కుమ్మక్కై నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్న రియల్టర్లు
- రియల్ మాఫియా ఉచ్చులో అమాయక కొనుగోలుదారులు
- బురిడీ కొట్టిస్తూ కోట్ల రూపాయల వ్యాపారం
- ఉన్నతాధికారులు స్పందించి వెంచర్‌ను సీజ్ చేయాలని డిమాండ్

4

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఇసితాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగించారు. చట్టబద్ధమైన నిబంధనలను కాలరాస్తూ విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లను ఏర్పాటు చేసి ప్లాట్ల వ్యాపారం సాగిస్తున్నారు. స్థానిక సర్వే నంబర్లు 58 నుంచి 66 వరకు సుమారు 10 ఎకరాల 17 గుంటల భారీ విస్తీర్ణంలో ఎలాంటి తుది ఆమోదాలు లేకుండానే వెంచర్ వేసి దర్జాగా విక్రయాలు జరుపుతున్నారు. నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి, ప్రభుత్వం నుంచి పక్కాగా ఫైనల్ లేఅవుట్ అనుమతులు పొందిన తర్వాతే ప్లాట్లు విక్రయించాల్సి ఉండగా.. ఇక్కడ మాత్రం ఎలాంటి నిబంధనలు పాటించకుండానే రియల్ మాఫియా చక్రం తిప్పుతోంది.

(సదాశివపేట-సిరి న్యూస్)





# మూడు నోటీసులిచ్చినా కదలని యంత్రాంగం!

- అక్రమ వెంచర్‌పై డీపీఓ జోక్యంపై స్థానికుల అనుమానాలు
- మన్నాన్‌పల్లి శివారులో కొనసాగుతున్న వెంచర్ పనులపై సమగ్ర విచారణకు డిమాండ్
- కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి





3

(కొండాపూర్-సిరిన్యూస్) : కొండాపూర్ మండల పరిధిలోని మన్నాన్‌పల్లి గ్రామ శివారులో అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. సంబంధిత పంచాయతీ అధికారులు ఇప్పటికే మూడు నోటీసులు జారీ చేసినప్పటికీ, తదుపరి చర్యలు మాత్రం ముందుకు సాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.





5

# కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేసిన మెదక్ ఎంపీ

తరగతి గదులు తిరుగుతూ సమస్యలు తెలుసుకున్న ఎంపీ

- సమస్యలపై ఏకరువు పెట్టిన విద్యార్థినీలు
- సొంత నిధులతో కొత్త మీటరు, విద్యుత్ కనెక్షన్
- విద్యాలయంలో బోరు వేయించిన ఎంపీ
- త్వరలో అదనపు బాత్‌రూంల నిర్మాణానికి హామీ
- విద్యాధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డ ఎంపీ

సిరి ఎఫెక్ట్..సిరి ఎఫెక్ట్
సిరి ఎఫెక్ట్
సిరి ఎఫెక్ట్..సిరి ఎఫెక్ట్



# చెత్తకుప్పల్లో దాగిన హెచ్చరిక!



- బోర్డు ఉన్నా చెత్త వేయాల్సిందే
- రూ.వెయ్యి జరిమానా అంటూ బోర్డు..
- అమలులో మాత్రం కనిపించని చర్యలు
- నిఘా ఏదీ?.. జరిమానాలు ఎన్ని?

## అధికారుల తీరుపై ప్రజల్లో అసంతృప్తి

గుమ్మడిదల, సెప్టెంబర్ 24 (సిరి న్యూస్): ఇక్కడ చెత్త వేయరాదు... చెత్త వేసినచో రూ.1,000 జరిమానా విధించబడును.. చట్టరీత్యా చర్యలు తీసుకోబడును.. అంటూ గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులే ఇప్పుడు చెత్తకుప్పల మధ్య కనిపించకుండా పోతున్నాయి. అధికారులు హెచ్చరికలు జారీ చేస్తూ బోర్డులు ఏర్పాటు చేసినా ప్రజల్లో మాత్రం మార్పు కనిపించకపోవడంతో బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోతున్న పరిస్థితి నెలకొంది. మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెత్త వేయకూడదని స్పష్టంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఆ బోర్డులను పట్టించుకోకుండా వాటి పక్కనే చెత్త సంచులు, వ్యర్థాలను తీసుకొచ్చి పడేస్తున్నారు. దీంతో హెచ్చరిక బోర్డుల ఉద్దేశమే ప్రశ్నార్థకంగా మారుతోంది. నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రహదారుల వెంట, బహిరంగ ప్రదేశాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తూ పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి.



### కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా చెత్తకుప్పలుగా మారుతున్న ప్రాంతాలను అధికారులు గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని, చెత్త తొలగింపు చర్యలను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా వాటిని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో భయం, బాధ్యత రెండూ పెరుగుతాయని స్థానికులు అంటున్నారు. మున్సిపల్ అధికారులు ఇకనైనా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించడంతో పాటు, ఆయా ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

### బోర్డు పెట్టారు.. నిఘా మరిచారు...

చెత్త వేస్తే రూ.1,000 జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ, ఆ నిబంధనను ఉల్లంఘిస్తున్న వారిపై ఎంతమేరకు చర్యలు తీసుకున్నారన్నది ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతోనే అధికారులు తమ బాధ్యత పూర్తయిందని భావిస్తున్నారా? లేక బోర్డులను ఉల్లంఘించి చెత్త వేస్తున్న వారిపై నిఘా ఉంచుతున్నారా? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారిని గుర్తించి జరిమానాలు విధించిన ఘటనలు పెద్దగా కనిపించకపోవడంతో హెచ్చరికలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిఘా లేకపోవడంతో రోడ్లపై ప్రయాణించే వారు సైతం చెత్తను అక్కడే పడేసి వెళ్లిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు.

### చెత్తకుప్పల్లో అధికారుల ఆదేశాలు

చెత్త వేయరాదు అని ఒకవైపు అధికారులు హెచ్చరిస్తుండగా అదే హెచ్చరిక బోర్డు కింద చెత్త పేరుకుపోవడం అధికారుల చర్యల అమలుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. చెత్త వేయడం నిత్యకృత్యంగా మారితే కేవలం బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపాలిటీ చర్యలు తీసుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపిస్తే ఆ ప్రయత్నాలన్నీ వృథా అయ్యే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. చెత్త వేస్తున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధిస్తేనే హెచ్చరికలకు విలువ ఉంటుందని చెబుతున్నారు.





# మూడు నోటీసులిచ్చినా
# కదలని యంత్రాంగం!

**(కొండాపూర్-సిరిన్యూస్): కొండాపూర్ మండల పరిధిలోని మన్నాన్పల్లి గ్రామ శివారులో అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. సంబంధిత పంచాయతీ అధికారులు ఇప్పటికే మూడు నోటీసులు జారీ చేసినప్పటికీ, తదుపరి చర్యలు మాత్రం ముందుకు సాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.**



- అక్రమ వెంచర్‌పై డిపీఓ జోక్యంపై స్థానికుల అనుమానాలు
- మన్నాన్ పల్లి శివారులో కొనసాగుతున్న వెంచర్ పనులపై సమగ్ర విచారణకు డిమాండ్
- కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి

## నోటీసులు ఇచ్చినా.. ఆగని పనులు...

మన్నాన్పల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 36, 37, 40, 41, 42, 43, 44, 47, 48, 49, 50, 51, 52, 53, 54, 55, 80, 81, 82, 83, 84, 85, 86లో వెంచర్‌కు సంబంధించిన పనులు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మూడు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు.

## కాలువలు, వాగుల పరిసితిపై విచారణ ఏది?

వెంచర్ పనుల కారణంగా నాళాలు, కాలువలు, వాగులు వంటి సహజ నీటి ప్రవాహ మార్గాలపై ప్రభావం పడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. అనుమతుల సమయంలో చూపిన నీటి ప్రవాహ మార్గాలు పనులు ప్రారంభమైన తర్వాత కూడా యథాతథంగా ఉన్నాయా? అనే అంశాన్ని ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

## వంద ఎకరాల్లో చెట్ల తొలగింపుపై ప్రశ్నలు..

వెంచర్ పరిధిలో సుమారు 100 ఎకరాల్లో చెట్ల తొలగింపు జరిగిందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. చెట్ల తొలగింపునకు సంబంధిత అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నారా? అనే అంశాలపై అటవీ శాఖ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## డిపీఓ జోక్యంపై స్థానికుల అనుమానాలు ?

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునే విషయంలో జిల్లా పంచాయతీ అధికారి (డిపీఓ) స్థాయిలో జోక్యం జరుగుతోందనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ ప్రక్రియ ముందుకు సాగకపోవడానికి కారణాలేమిటో అధికారులు స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు. వెంచర్ నిర్వాహకులకు అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవం ఎంత? చర్యలు ఆలస్యం కావడానికి పరిపాలనా కారణాలేమైనా ఉన్నాయా? అనే అంశాలపై జిల్లా అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.





## కలెక్టర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్

మూడు నోటీసులు జారీ అయినప్పటికీ చర్యలు ముందుకు సాగకపోవడంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీ, ఇరిగేషన్, అటవీ శాఖల అధికారులతో సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి వెంచర్‌కు సంబంధించిన అనుమతులు, నిర్మాణాలు, నీటి ప్రవాహ మార్గాలు, చెట్ల తొలగింపు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేదంటే సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.








# నిబంధనలకు తిలోదకాలు.. కనిపించని సౌకర్యాలు!

## సదాశివపేట మండలం ఇసితాబాద్‌లో రియల్ మాఫియా లీలలు

- సర్వే నంబర్లు 58 నుంచి 66 వరకు 10 ఎకరాలకు పైగా అక్రమ దందా
- టీఎల్‌పీ కాగితాల ముసుగులో కనీస అభివృద్ధి పనులే చేయని వైనం
- రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ లేకుండానే యథేచ్ఛగా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు
- 10 శాతం గ్రామ పంచాయతీ ఓపెన్ స్పేస్‌నూ వాడేశారు..
- ఫైనల్ లేఅవుట్ అనుమతి రాకముందే వ్యాపారుల హడావుడి
- గ్రామ పంచాయతీ ఆదాయానికి లక్షల్లో గండి
- అధికారులతో కుమ్మక్కై నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్న రియల్టర్లు
- రియల్ మాఫియా ఉచ్చులో అమాయక కొనుగోలుదారులు
- బురిడీ కొట్టిస్తూ కోట్ల రూపాయల వ్యాపారం
- ఉన్నతాధికారులు స్పందించి వెంచర్‌ను సీజ్ చేయాలని డిమాండ్

**సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఇసితాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగించారు. చట్టబద్ధమైన నిబంధనలను కాలరాస్తూ విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లను ఏర్పాటు చేసి ప్లాట్ల వ్యాపారం సాగిస్తున్నారు. స్థానిక సర్వే నంబర్లు 58 నుంచి 66 వరకు సుమారు 10 ఎకరాల 17 గుంటల భారీ విస్తీర్ణంలో ఎలాంటి తుది ఆమోదాలు లేకుండానే వెంచర్ వేసి దర్జాగా విక్రయాలు జరుపుతున్నారు. నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి, ప్రభుత్వం నుంచి పక్కాగా ఫైనల్ లేఅవుట్ అనుమతులు పొందిన తర్వాతే ప్లాట్లు విక్రయించాల్సి ఉండగా.. ఇక్కడ మాత్రం ఎలాంటి నిబంధనలు పాటించకుండానే రియల్ మాఫియా చక్రం తిప్పుతోంది.**

(సదాశివపేట-సిరి న్యూస్)

### 10 శాతం పంచాయతీ సలానికే ఎసరు..

ప్రభుత్వ లేఅవుట్ నిబంధనల ప్రకారం మొత్తం విస్తీర్ణంలో 10 శాతం స్థలాన్ని ఓపెన్ స్పేస్ కింద గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలి. ఆ స్థలంలో పచ్చదనం, చిన్నారుల ఆటస్థలం, పార్కులను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా వేసిన ఈ వెంచర్‌లో ఓపెన్ స్పేస్‌కు సరైన కేటాయింపులు చేయకపోగా, ఆ స్థలాలను సైతం ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు యత్నిస్తున్నారన్న తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయించాల్సిన భూమిని కాజేస్తూ, గ్రామ పంచాయతీ భవిష్యత్ అవసరాలను, ప్రజల హక్కులను పూర్తిగా కాలరాస్తున్నారు.

### నిబంధనలు గాలికి..

డీటీసీపీ నిబంధనల ప్రకారం లేఅవుట్‌లో 33 అడుగుల రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, ప్రతి ప్లాట్‌కు రక్షిత మంచినీటి కనెక్షన్, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, వీధి దీపాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. కానీ ఇసితాబాద్‌లోని సదరు వెంచర్‌లో క్షేత్రస్థాయికి వెళ్లి చూస్తే కనీస వసతులు కల్పించిన దాఖలాలే లేవు. రాళ్లు పాతడం, మట్టి రోడ్లు వేయడం తప్ప శాశ్వత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టలేదు. అభివృద్ధి పనులు పూర్తి చేయకుండానే, అనుమతులు ఉన్నాయంటూ ఫ్లెక్సీలు, బ్రోచర్లతో అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తూ ప్లాట్లను అంటగడుతున్నారు.





### గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి

అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ లేఅవుట్ కారణంగా గ్రామ పంచాయతీ ఖజానాకు దక్కాల్సిన లక్షలాది రూపాయల ఆదాయం గాల్లో కలిసిపోయింది. అధికారికంగా లేఅవుట్ అనుమతి తీసుకుంటే గ్రామ పంచాయతీకి బెటర్‌మెంట్ చార్జీలు, డెవలప్‌మెంట్ ఫీజులు, లేఅవుట్ ఫీజుల రూపంలో భారీగా ఆదాయం సమకూరుతుంది. కానీ ఇక్కడ కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో రియల్టర్లు కుమ్మక్కై, నామమాత్రపు వ్యవహారాలతో అక్రమంగా లేఅవుట్‌ను ముందుకు నడిపిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. పంచాయతీ పర్యవేక్షణ లోపించడం వల్లే అక్రమార్కులు యథేచ్ఛగా వెంచర్లు వేసి కోట్లు గడిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.



### కొనుగోలుదారులు మోసపోవద్దు..

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు నిలువునా మోసపోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేపటి రోజున ఇళ్ల నిర్మాణాలకు గ్రామ పంచాయతీ అనుమతులు రావని, రిజిస్ట్రేషన్లలోనూ తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని స్పష్టం చేస్తున్నారు. సదాశివపేట మండలం ఇసితాబాద్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన ఈ భారీ వెంచర్‌పై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, డీటీసీపీ విజిలెన్స్ అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలి. ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్ వేసి అమ్మకాలు సాగిస్తున్న రియల్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, సదరు లేఅవుట్‌ను వెంటనే సీజ్ చేసి అక్రమ రిజిస్ట్రేషన్లను అడ్డుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





# కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేసిన మెదక్ ఎంపీ



## తరగతి గదులు తిరుగుతూ సమస్యలు తెలుసుకున్న ఎంపీ

**సిరి ఎఫెక్ట్**

- సమస్యలపై ఏకరువు పెట్టిన విద్యార్థినీలు
- సొంత నిధులతో కొత్త మీటరు, విద్యుత్ కనెక్షన్
- విద్యాలయంలో బోరు వేయించిన ఎంపీ
- త్వరలో అదనపు బాత్‌రూంల నిర్మాణానికి హామీ
- విద్యాధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డ ఎంపీ
- విద్యార్థినీలకు మామయ్యలా వచ్చి సమస్యలకు పరిష్కారం చూపిన ఎంపీ
- ఎంపీ ఉదారత్వానికి హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థినీలు, ప్రజలు

**మెదక్, సెప్టెంబర్ 27 (సిరిన్యూస్) :** మెదక్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినీలు ఎదుర్కొంటున్న సమస్యలపై మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు తీవ్రస్థాయిలో స్పందించారు. ఆదివారం *సిరి* దినపత్రికలో *కస్తూర్బా విద్యాలయంలో తాగునీటి తంటా. ..నాలుగు రోజులుగా విద్యార్థినీల కష్టాలు* అనే శీర్షిక ప్రచురితం కావడంతో ఎంపీ రఘు నందన్ రావు విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీకి విస్తుపోయే సమస్యలు తేటతెల్లమయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీ పాఠశాలలో ఉన్న పలు సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యుత్ సమస్య ఉండడం వల్ల బోర్ పని చేయడం లేదని, తాగునీరు అందించే వాటర్ ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని తెలిపారు. స్నానాలకు వేడినీరు ఇవ్వడం లేదని, విద్యార్థులకు ఫ్యాన్లు కూడా సరిగా పనిచేయడం లేదని వాపో యారు. సుమారు 300 మంది విద్యార్థులు ఉండగా 12 బాత్ రూంలు మాత్రమే ఉన్నాయని, అలాగే బట్ట లు ఆరేసుకోవడానికి సరైనటువంటి ఏర్పాటు లేదని ఎంపీ మండిపడ్డారు. పాఠశాలకు సమీపంలో ఉన్న ఫంక్షన్ హాళ్ళ నుండి వెలువడే డ్రైనేజీ నీరు పాఠశాల పక్కన వదిలేయడం వల్ల దుర్గంధం వ్యాపిస్తుందని, దీంతో రకరకాల సమస్యలు వస్తున్నాయని చెప్పారు. కాస్మోటిక్ అమౌంట్ రావడం లేదని విద్యార్థులు తెలి పారు. పాఠశాలలో విద్యాబోధన విధానం, పాఠశాల ప్రాంతంలో పరిశుభ్రతను ఎంపీ తనిఖీ చేశారు.

### చదువులోనూ ఇబ్బందులే..

రెండు నెలలుగా తెలుగు ఉపాధ్యాయుడు అందుబాటులో లేరని విద్యార్థులు ఎంపీకి తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు తెలుగు ఛందస్సు, తెలుగు అక్షరమాల, ఇంగ్లిష్ అల్ఫాబెట్స్ వంటి ప్రాథమిక అంశాల్లోనూ ఇబ్బందులు ఉన్నాయని, హెచ్2ఓ, హెచ్సీఎల్ వంటి ప్రాథమిక శాస్త్రీయ అంశాలపై కూడా అవగాహన కల్పించే పరిస్థితి లేదని ఎంపీ స్పష్టం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మెడికల్ లీవ్‌లో ఉన్నారని, దానికి సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్‌పై కూడా ఎంపీ ఆరా తీశారు. పాఠశాల నిర్వహణలో లోపాలపై సంబంధిత అధికారుల నుంచి వివరణ తీసుకోవాలని ఆదేశించారు.

### సొంత నిధులతో బోరు, విద్యుత్ మరమ్మతులు

పాఠశాలకు సంబంధినటువంటి ఎలక్ట్రీషియన్‌ను పిలిచి కరెంటు సమస్య ఎక్కడుందో తెలుసుకొని విద్యుత్ ఏఈ, ఏడితో మాట్లాడి కొత్త ట్రాన్స్ఫార్మర్, తన వేతనం నుండి కొత్త మీటర్ కోసం ఇచ్చి అప్పుడే పనులు ప్రారంభించారు. బోర్ బండి పిలిపించి బోర్ కూడా తన సొంత నిధులతో వేయించడం జరిగింది. బోరులో సైతం సమృద్ధిగా నీరు పడడంతో సిబ్బంది, విద్యార్థినీలు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే మరో 30 అదనపు బాత్రూములు కూడా ఎంపీ లాండ్స్ నుండి కట్టిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. పాఠశాలలో పరిశుభ్రతపై స్వచ్ఛభారత్ చేయాలని భారతీయ జనతా పార్టీ కార్యకర్తలను ఆదేశించడం జరిగింది. ఇక్కడున్న సమస్యలన్నీ కలెక్టర్ దృష్టికి ఫోన్లో మాట్లాడడం జరిగింది. అనంతరం విద్యార్థుల బోధనపై సమీక్ష చేశారు. విద్యాలయంలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించి ఎలాంటి ఆటంకం లేకుండా చక్కని బోధన అందించాలని ఆదేశించారు. వారికి నాణ్యమైన విద్య, మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం, పరిశుభ్రత పాటించాలని అధ్యాపకులను దిశా నిర్దేశం చేశారు.

### టీచర్ల పిల్లలు ఇలాగే చదువుతారా ?

"టీచర్ల పిల్లలు ఇలాగే చదివితే ఊరుకుంటారా?" పాఠశాలలో విద్యార్థులకు అందాల్సిన కనీస సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందకపోవడంపై ఎంపీ అసహనం వ్యక్తం చేశారు. "టీచర్ల పిల్లలు కూడా ఇదే విధంగా చదువుకుంటే మనం ఊరుకుంటామా? విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత" అని అధికారులను ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలను కేవలం విని వెళ్లిపోకుండా, అక్కడికక్కడే కొన్ని సమస్యలకు పరిష్కారం చూపించడంతో విద్యార్థుల్లో ఆశాభావం వ్యక్తమైంది.

### విద్యార్థినీలకు 'మామయ్య'గా వచ్చిన ఎంపీ..

పాఠశాలలోని 319 మంది విద్యార్థినుల సమస్యలను తన కుటుంబ సభ్యుల సమస్యలుగా భావించి, మామయ్యలా వారి కష్టాలను విని.. దేవుడిలా తక్షణ సహాయం అందించిన ఎంపీ రఘునందన్ రావు అంటూ విద్యార్థులు, స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. "చదువుకోవాల్సిన వయసులో పిల్లలు నీళ్లు, కరెంట్, బాత్రూమ్‌ల కోసం ఇబ్బంది పడకూడదు. వారి భవిష్యత్తుకు అవసరమైన వాతావరణం కల్పించాలి" అనే సందేశంతో ఎంపీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### ఎంపీ తనిఖీపై విద్యార్థినీల ఆనందం

కస్తూర్బా గాంధీ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై *సిరి* దినపత్రిక వెలుగులోకి తేవడంతో వెంటనే స్పందించిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తమ పాఠశాల తనిఖీ చేయడం పట్ల విద్యార్థినీలు ఆనందం వ్యక్తం చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను సిరి పత్రిక కథనాలు రాయడంతో తమ సమస్యలకు పరిష్కారం ఎంపీ నేతృత్వంలో పరిష్కరమయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. విద్యాలయంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎంపీ తక్షణ స్పందనకు పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యువ నేతగా, ఎంపీగా రఘునందన్‌రావు ప్రజా సమస్యల పట్ల ఉన్న చిత్తశుద్ధికి పలువురు కొనియాడుతున్నారు. త్వరలోనే విద్యార్థినీలకు అదనపు బాత్ రూంలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీనివ్వడం, తన సొంత నిధులతో విద్యుత్ సమస్యను పరిష్కరించడమే కాకుండా విద్యార్థులకు బోధన విషయంలో నిర్లక్ష్యం, సౌకర్యాల లేమిపై సిబ్బందిని, విద్యాశాఖ అధికారులపై ఎంపీ మండిపడ్డారు. ఏదిఏమైనా వెంటనే స్పందించి విద్యార్థినీల సమస్యలను పరిష్కరించడం ఎంపీ రఘునందన్‌రావు ఉదారత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది.




